ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు


SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com సంపుటి : 01 సంచిక : 214 బుధవారం 22 - 07 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజీలు : 08 వెల : 6/-

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com VOLUME : 01 Issue : 214 Wednesday 22 - 07 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-


# ఆగస్టు 30లోగా తనిఖీలు పూర్తి కావాలి

- బీసీ గురుకులాలపై మంత్రి పొన్నం ఆదేశాలు
- విద్యార్థులకు విద్యతో పాటు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యమన్న పొన్నం
- ప్రతి ఆర్‌సీవో కచ్చితంగా వారానికి మూడు రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశం
- తాను కూడా ప్రతి నెల కనీసం 15 గురుకులాల్లో తనిఖీలు నిర్వహిస్తానని వెల్లడి



**వార్త సంధ్య, హైదరాబాద్, జులై 21 :** తెలంగాణ రాష్ట్రంలోని బీసీ గురుకుల విద్యాసంస్థల నిర్వహణ, విద్యార్థుల వసతులపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కఠిన నిబంధనలు విధించారు. బీసీ గురుకుల రీజనల్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్లతో (ఆర్‌సీవో) కీలకమైన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన... రాబోయే ఆగస్టు 30వ తేదీ నాటికి రాష్ట్రంలోని అన్ని బీసీ గురుకుల విద్యాసంస్థల్లో క్షేత్రస్థాయి తనిఖీలను - మిగతా 2 లో



## ఉత్తమ్ కుమార్ రెడ్డి మాటలు నమ్మిన రైతులు తీవ్రంగా నష్టపోయారు

- మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు
- దేవాదుల నుంచి నీళ్లు రాక రైతులు నష్టపోయారన్న హరీశ్
- దేవాదుల కింద ఎన్ని రిజర్వాయర్లు ఉన్నాయో కూడా ఉత్తమ్ కు తెలియదని ఎద్దేవా
- నీళ్ల నిర్వహణపై ప్రభుత్వానికి అవగాహన లేదని విమర్శ

**వార్త సంధ్య, హైదరాబాద్, జులై 21 :** మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యలను నమ్మి దేవాదుల ప్రాజెక్టు కింద - మిగతా 2 లో

## నీట్ లీకేజీ వ్యవహారం అత్యంత బాధాకరం



- బీజేపీ ఎంపీ రఘునందన్ రావు
- నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ అంశంపై సీబీఐ దర్యాప్తు వేగంగా జరుగుతోందన్న రఘునందన్ రావు
- ఈ అంశంపై పార్లమెంట్‌లో సమాధానం ఇచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని వెల్లడి
- విపక్షాలు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నాయని మండిపాటు

**వార్త సంధ్య, హైదరాబాద్, జులై 21 :** నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారం అత్యంత బాధాకరమని, అయితే ఈ అంశంపై ఇప్పటికే సీబీఐ దర్యాప్తు వేగవంతంగా కొనసాగుతోందని - మిగతా 2 లో

## రాహుల్ గాంధీ, ప్రియాంకలను అదుపులోకి తీసుకున్న పోలీసులు



- ప్రధాని మోదీ నివాసం వద్ద హైడ్రామా
- నీట్ వివాదం, విద్యార్థులపై లాఠీచార్జి అంశాలపై మోదీ నివాసం వద్ద కాంగ్రెస్ నిరసన
- రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ,కాంగ్రెస్ నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- విద్యాశాఖ మంత్రి రాజీనామాకు పట్టుబట్టడంతో విఫలమైన చర్చలు
- అమిత్ షా ప్రకటన చేయాలని డిమాండ్ చేసిన కాంగ్రెస్
- ఢిల్లీలో కొనసాగుతున్న రాజకీయ ఉద్రిక్తత

**వార్త సంధ్య,ఢిల్లీ, జులై 21 :** నీట్ పరీక్షల వివాదం, విద్యార్థులపై లాఠీచార్జి అంశాలు దేశ రాజధాని ఢిల్లీలో తీవ్ర రాజకీయ ఉద్రిక్తతకు దారితీశాయి. ప్రధాని నరేంద్ర మోదీ నివాసాన్ని ముట్టడించేందుకు యత్నించిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాలను ఢిల్లీ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు పలువురు సీనియర్ నేతలు, ఎంపీలను కూడా నిర్బంధంలోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు. ఈ ఘటనతో లోక్ కళ్యాణ్ మార్గ్ వద్ద తీవ్ర హైడ్రామా చోటుచేసుకుంది.నీట్ పరీక్షల్లో అవకతవకలపై పార్లమెంటులో చర్చకు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆందోళన బాట పట్టింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో - మిగతా 2 లో

## అధికార ప్రతినిధిపై కాక్రోచ్ జనతా పార్టీ వేటు

- నిరసనల మధ్య బర్గర్ వివాదం
- కాక్రోచ్ జనతా పార్టీ అధికార పదవి నుంచి విజేత దహియా తొలగింపు
- నిరసనల మధ్య అసందర్భంగా ప్రవర్తించారన్న ఆరోపణలపై చర్యలు
- సహచరులు దీక్షలో ఉండగా బర్గర్ తింటున్న వీడియో వైరల్ కావడంతో వివాదం




**వార్త సంధ్య,ఢిల్లీ, జులై 21 :** యువజన ఉద్యమ పార్టీగా గుర్తింపు పొందిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ), తమ అధికార ప్రతినిధి విజేత దహియాపై క్రమశిక్షణా చర్యలు చేపట్టింది. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న నిరసనల - మిగతా 2 లో

## షూటింగ్‌లో బాలకృష్ణకు స్వల్ప గాయం

- కాకినాడ పోర్ట్ పరిసరాల్లో 'NBK 111' షూటింగ్
- యాక్షన్ సీన్ చిత్రీకరిస్తుండగా కాలుజారి కిందపడ్డ బాలయ్య
- గాయం స్వల్పమైనదేనని ప్రకటించిన వైద్యులు



**వార్త సంధ్య, హైదరాబాద్, జులై 21 :** నటసింహం, స్టార్ హీరో నందమూరి బాలకృష్ణ కాకినాడ పోర్ట్ ప్రాంగణంలో జరుగుతున్న తన తాజా చిత్రం 'చీదీఖ111' షూటింగ్‌లో ప్రమాదానికి గురయ్యారు. డైరెక్టర్ గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ కోసం కాకినాడ పోర్ట్ పరిసర ప్రాంతాల్లో కొన్ని కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. మంచు మనోజ్‌తో కలిసి ఒక హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్న సమయంలో బాలకృష్ణ అనుకోకుండా కాలుజారి కిందపడటంతో ఆయన మోకాలికి స్వల్ప గాయమైంది.ఈ ప్రమాదం జరిగిన వెంటనే చిత్ర యూనిట్ సభ్యులు షూటింగ్‌ను అక్కడికక్కడే నిలిపివేసి, ఆయనను తక్షణ చికిత్స కోసం సమీపంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలోని వైద్యుల బృందం - మిగతా 2 లో

## విద్యార్థుల ఆందోళనల వేళ నీట్ లీక్‌పై ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు

- నీట్ పేపర్ లీక్ దోషులకు అత్యంత కఠిన శిక్ష విధించాలన్న ప్రధాని మోదీ
- పరీక్షల నిర్వహణకు పటిష్ఠమైన వ్యవస్థను నిర్మించాలని సూచన
- పార్లమెంటు ముట్టడికి యత్నించిన విద్యార్థులపై లాఠీఛార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగం
- నిరసనకారులతో కేంద్ర మంత్రి జేపీ నడ్డా చర్చలు.. కొనసాగుతున్న ఉత్కంఠ






## మంగళగిరిలో నారా లోకేశ్ 7.30 గంటల నాన్ స్టాప్ 'పట్టా'భిషేకం

- మంగళగిరిలో 1331 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ
- 'మన ఇల్లు - మన లోకేశ్' కార్యక్రమానికి శ్రీకారం
- సుమారు 7.30 గంటల పాటు నిలబడే పట్టాలు అందించిన మంత్రి లోకేశ్
- లబ్ధిదారులకు పట్టాతో పాటు నూతన వస్త్రాలు బహూకరణ

**వార్త సంధ్య, అమరావతి, జులై 21 :** మంగళగిరి నియోజకవర్గంలోని అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసేందుకు ఉద్దేశించిన 'మన ఇల్లు - - మిగతా 2 లో

## 2021 నాటికే పూర్తి కావాల్సిన పోలవరాన్ని వైసీపీ నాశనం చేసింది




- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు
- వైసీపీ పాలనలో పోలవరం ప్రాజెక్టు తీవ్రంగా నష్టపోయిందన్న నిమ్మల
- నిర్వాసితులను కూడా గత ప్రభుత్వం మోసం చేసిందని విమర్శ
- ఇప్పుడిప్పుడే రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు బాగుపడుతున్నాయని వ్యాఖ్య

**వార్త సంధ్య, అమరావతి, జులై 21 :** 2019లో తెలుగుదేశం ప్రభుత్వం కొనసాగి ఉంటే 2021 నాటికే పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేదని... కానీ గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల విధ్వంస పాలన వల్ల ప్రాజెక్టు తీవ్రంగా నష్టపోయిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇప్పుడిప్పుడే - మిగతా 2 లో

# ఆంధ్రప్రదేశ్‌లో యూఏఈ ఫుడ్ క్లస్టర్

- గ్లోబల్ మార్కెట్ వైపు అడుగులు
- ముఖ్యమంత్రి చంద్రబాబుతో యూఏఈ ఆర్థిక మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ భేటీ
- ఏపీలో ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుకు ముందుకొచ్చిన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్
- దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో కుదుర్చుకున్న మరో ఒప్పందం సాకారం
- ఏపీ ప్రభుత్వం, యూఏఈ మధ్య కుదిరిన కీలక భాగస్వామ్యం
- ఏపీలో యూఏఈ ఫుడ్ క్లస్టర్ ఏర్పాటు
- మామిడి, అరటి వంటి ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ కల్పనే లక్ష్యం



**వార్త సంధ్య, అమరావతి, జులై 21 :** ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ ఏడాది దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో కుదిరిన మరో కీలక ఒప్పందం కార్యరూపం దాల్చే దిశగా ముందడుగు పడింది. రాష్ట్రంలో ఫుడ్ క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం భేటీ అయింది.ఈ ఏడాది దావోస్ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో జరిపిన చర్చల సందర్భంగా ఏపీలో ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుకు యూఏఈ సంసిద్ధత వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఆ ఒప్పందాన్ని ఆచరణలోకి తీసుకురావడంలో భాగంగా యూఏఈ ప్రతినిధులు అమరావతికి వచ్చారు. ఆహార శుద్ధి రంగంలో ఆంధ్రప్రదేశ్‌లో - మిగతా 2 లో

# సంపాదకీయం

## మళ్ళీ కాలుదువ్వుతున్న 'నాటో'



ఇటీవల అనేక సందర్భాల్లో నాటో మిలిటరీ కూటమి మధ్య ఐక్యత సన్నగిల్లిందన్న భావన అందరికీ కలిగింది. ఉదాహరణకు-- గ్రీన్‌ల్యాండ్‌ను ఆక్రమిస్తామని అమెరికా అంటే.. నాటో కూటమిలో ఒక్క సభ్యదేశం కూడా అమెరికాను బలపర్చలేదు. పైగా సభ్యదేశాలైన జర్మనీ, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, ఇటలీ, నెదర్లాండ్ దేశాల సైనికులు గ్రీన్‌ల్యాండ్‌లో దిగి డెన్మార్క్‌కు అండగా నిలిచారు. 'ఇరాన్‌పై దాడికి కలిసి రండి' అని ట్రంప్ పిలుపునిస్తే స్పెయిన్, ఇటలీ, జర్మనీ, ఫ్రాన్స్, యూకే తదితర నాటో సభ్య దేశాలు తమకేమీ సంబంధంలేదని అమెరికాను ఏకాకిని చేశాయి. నాటో దేశాల ఒప్పందంలోని 5వ ఆర్టికల్ 'అందరి కోసం ఒక్కరూ, ఒక్కరి కోసం అందరూ' అన్న హామీ ప్రకారం, ఈ దేశాలపై ఏ దేశం దాడి చేసినా మిగతా దేశాలన్నీ కలిసికట్టుగా ఆ దేశంతో యుద్ధానికి దిగాలి. కానీ ఇరాన్‌పై అమెరికా--ఇజ్రాయెల్ తలపెట్టిన దాడికి మద్దతుగా ఈ ఆర్టికల్ అమలు కాలేదు. లోగడ ఇరాక్, అఫ్ఘానిస్థాన్‌లపై దాడికి నాటో దేశాలు తమతో కలిసివచ్చినట్టుగానే ఇప్పుడు ఇరాన్‌పై యుద్ధానికి కూడా కలిసి వస్తాయని ట్రంప్ ఊహించుకొని చివరకు భంగపడ్డాడు. ఎవర్ని అడిగి యుద్ధం ప్రారంభించావని ట్రంప్‌ను నాటో దేశాలు నిలదీశాయి. దీంతో నాటో నిలువునా చీలిపోయిందనే అంతా అనుకున్నారు. కానీ ఇటీవల టర్కీలో జరిగిన నాటో శిఖరాగ్ర సమావేశం ఆ కూటమి మళ్లీ పటిష్ఠం అవుతుందన్న భావనను కలిగించింది. "మరింత బలమైన నాటోతో మరింత బలమైన ఐరోపా" అనే నినాదం నాటో 3.0 భావనను సాకారం చేయనుంది. దీని ప్రకారం, ఐరోపా తన రక్షణ బలాన్ని రష్యాకు వ్యతిరేకంగా పెంచబోతోంది. చైనాను ఎదుర్కోవడానికి అమెరికా తన బలగాలను ఆసియా పసిఫిక్‌లో కేంద్రీకరించబోతున్నది. ఇటీవల టర్కీలో జరిగిన 32 సభ్య దేశాల నాటో కూటమి 36వ శిఖరాగ్ర సమావేశంలో ప్రతి సభ్యదేశం తన సైన్యం కోసం స్థూల దేశీయోత్పత్తిలో 5 శాతాన్ని ఖర్చు చేయాలన్న ప్రతిపాదన వచ్చింది. అలాగే రష్యాకు వ్యతిరేకంగా 80 బిలియన్ల విలువ చేసే ఆయుధాల్ని ఉక్రెయిన్‌కు పంపాలని నాటో కూటమి నిర్ణయించింది. ఈ శిఖరాగ్ర సమావేశం కోసం ఎర్డోగాన్ ప్రభుత్వం టర్కీ రాజధాని అంకారాను దిగ్బంధించి, పదమూడు రోజుల పాటు అన్ని ప్రదర్శనలను నిషేధించింది. 225 మందిని అదుపులోకి తీసుకుని, 103 మందిని జైలులో పెట్టింది. సమావేశానికి ముందు మిత్ర దేశాల కంపెనీల మధ్య పదుల బిలియన్ల డాలర్ల విలువైన ఒప్పందాలు కుదిరాయి. ముఖ్యంగా అధిక లాభాల వేటకు పరుగెత్తే ఆయుధ కంపెనీలకు పండుగే. రెండువేల కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదించగల సుదూర క్షిపణులను నిర్మించడానికి బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ ఈ సమావేశంలో 50 బిలియన్ డాలర్ల కార్యక్రమాన్ని ప్రకటించాయి. ఈ దూరం మాస్కోను లక్ష్యంగా చేసుకోవడానికే. సిటీ గ్రూప్, డాయిష్ బ్యాంక్, బీఎన్‌పీ పారిబాస్‌తో సహా కొన్ని బ్యాంకులు వీటి నిర్మాణం కోసం ఇప్పటికే 217 బిలియన్ డాలర్లను సమీకరించాయి. అదే సమయంలో అమెరికా బడ్జెట్ 850 బిలియన్ల యూరోలుగా ఉంది. యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ లేయన్ 2030 నాటికి పునరాయుధీకరణ కోసం 800 బిలియన్ల యూరోలను మానవ విధ్వంసానికి పాల్పడే ఆయుధాలకు కేటాయించటానికి తహతహలాడుతున్నారు. నాటో కూటమి ఒకప్పటి సోవియట్ యూనియన్‌కు, సోషలిస్టు దేశాలకు వ్యతిరేకంగా ఏర్పడి, ప్రచ్ఛన్న యుద్ధానికి, ఆయుధ పోటీకి కారణమైంది. 1989లో జీడీఆర్-- పశ్చిమ జర్మనీతో విలీనం సందర్భంగా గోర్బచెవ్--బుష్‌ల మధ్య పెద్దమనుషుల ఒప్పందం జరిగింది. దీని ప్రకారం, నాటో కూటమి తూర్పు ఐరోపాకు ఒక్క అంగుళం కూడా విస్తరించకూడదు. 1991 ప్రారంభంలో సోవియట్ యూనియన్, సోషలిస్టు దేశాలు పతనమైన తర్వాత రష్యా వార్సా సంధి కూటమిని రద్దు చేసుకుంది. కానీ, ప్రచ్ఛన్న యుద్ధం ముగిసినా నాటో రద్దు కాలేదు. పైగా ఒప్పందాన్ని ఉల్లంఘించి రష్యాకు వ్యతిరేకంగా ఒకప్పటి తూర్పు సోషలిస్టు దేశాలకు నాటోను విస్తరించింది. కొన్ని బాల్టిక్ రిపబ్లిక్‌లు కూడా నాటోతో చేరాయి. ఇవన్నీ ఒకప్పటి సోవియట్ యూనియన్‌లో అంతర్భాగంగా ఉండేవి. రష్యాలో బలహీనమైన ఆర్థిక వ్యవస్థతోపాటు, అప్పటి రష్యా అధ్యక్షుడు ఎల్సిన్ అసమర్థత కారణంగా నాటో చకాచకా పావులు కదిపి విస్తరించింది. ఇప్పుడది ఉక్రెయిన్‌ను అడ్డుపెట్టుకొని రష్యాను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తోంది.

## రాహుల్ గాంధీ, ప్రియాంకలను అదుపులోకి తీసుకున్న పోలీసులు



**మొదటిపేజీ తరువాయి -** సమావేశమైన అనంతరం రాహుల్, ప్రియాంక, కేసీ వేణుగోపాల్, పవన్ ఖేరా వంటి సీనియర్ నేతల నేతృత్వంలో కాంగ్రెస్ ఎంపీలు ప్రధాని నివాసం వైపు పాదయాత్రగా బయలుదేరారు. అయితే, వారిని పోలీసులు బారికేడ్లతో అడ్డుకున్నారు. దీంతో కాంగ్రెస్ నేతలు రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో కేంద్ర ప్రభుత్వం చర్చలకు ప్రయత్నించింది. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ నిరసన స్థలానికి చేరుకుని రాహుల్ గాంధీతో మాట్లాడారు. పార్లమెంటులో నీట్ అంశంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. అయితే, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంటులో ప్రకటన చేయాలని కాంగ్రెస్ నేతలు పట్టుబట్టడంతో చర్చలు విఫలమయ్యాయి. చర్చలు కొలిక్కి రాకపోవడంతో, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్‌ఏఎఫ్) సహా భారీగా మోహరించిన పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. నిరసనకారులను బలవంతంగా అక్కడి నుంచి తరలించారు. ఈ క్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేష్ బఘేల్, రణ్‌దీప్ సూర్జేవాలా, కె. సురేశ్, చరణ్‌జిత్ సింగ్ చన్నీ సహా పలువురు కాంగ్రెస్ నేతలను అదుపులోకి తీసుకుని సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ కూడా నిరసన స్థలానికి వచ్చి కాంగ్రెస్ నేతలకు మద్దతు తెలిపారు. నీట్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై జరిగిన పోలీసుల దాడిపై విచారణ జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమ నేతలను అరెస్ట్ చేయడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. మరోవైపు, ప్రధాని నివాసం వంటి అత్యంత కీలకమైన, సున్నితమైన ప్రాంతంలో నిరసనలు చేపట్టడం భద్రతా నిబంధనలను ఉల్లంఘించడమేనని అధికార పక్షం విమర్శిస్తోంది. ఈ ఘటనతో నీట్ వివాదం మరింత వేడెక్కింది.

## అధికార ప్రతినిధిపై కాక్రోచ్ జనతా పార్టీ వేటు




**మొదటిపేజీ తరువాయి -** నేపథ్యంలో ఆయన ప్రవర్తన తీవ్ర వివాదాస్పదం కావడంతో, పార్టీ ఆయనపై వేటు వేస్తూ మంగళవారం నిర్ణయం తీసుకుంది. దహియాను తక్షణమే అన్ని అధికారిక బాధ్యతల నుండి తొలగిస్తున్నట్లు పార్టీ స్పష్టం చేసింది. 'నీట్' పరీక్షల్లో నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలపై జవాబుదారీతనం వహించాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో సోనమ్ వాంగ్‌చుక్ వంటి ప్రముఖులు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టగా, అదే నిరసన స్థలికి సమీపంలో దహియా బర్గర్ తింటూ కనిపించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై వివరణ కోరగా, తాను ఎన్నికైన ప్రతినిధిని కానని, కేవలం స్వచ్ఛందంగానే ఉద్యమంలో పాల్గొంటున్నానని, తానెవరికీ బాధ్యత వహించాల్సిన అవసరం లేదని ఆయన సమాధానమివ్వడం మరింత వివాదానికి దారితీసింది. ఈ ఉదంతంపై సీజేపీ నాయకత్వం తీవ్రంగా స్పందించింది. దహియా ప్రవర్తన ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని, అది పార్టీ విలువలకు, ఉద్యమ సిద్ధాంతాలకు విరుద్ధమని 'ఎక్స్' వేదికగా విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. క్లిష్ట సమయాల్లో సరైన నిర్ణయం తీసుకునే సామర్థ్యం ఆయనలో పూర్తిగా లోపించిందని పార్టీ ఘాటుగా వ్యాఖ్యానించింది.

## షూటింగ్‌లో బాలకృష్ణకు స్వల్ప గాయం



**మొదటిపేజీ తరువాయి -** బాలకృష్ణకు ప్రాథమిక చికిత్స అందించడంతో పాటు అవసరమైన ఇతర వైద్య పరీక్షలను పూర్తి చేసింది. ఈ గాయం చాలా స్వల్పమైనదేనని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు స్పష్టం చేశారు. అయితే, త్వరగా కోలుకోవడానికి కొన్ని రోజుల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని ఆయనకు వైద్యులు సూచించారు. 'వీరసింహారెడ్డి' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ విజయం తర్వాత బాలకృష్ణ – గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో వస్తున్న రెండవ చిత్రం కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. కాకినాడ షెడ్యూల్‌లో రిస్కీ యాక్షన్ దృశ్యాలను తెరకెక్కిస్తున్న సమయంలో ఈ అనుకోని సంఘటన జరిగిందనే వార్త సోషల్ మీడియాలో వ్యాపించడంతో అభిమానులు, సినీ ప్రముఖులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి పూర్తిగా స్థిరంగా ఉందని, ఆసుపత్రి నుంచి త్వరలోనే డిశ్చార్జ్ అయి తిరిగి కోలుకుంటారని సమాచారం.

## విద్యార్థుల ఆందోళనల వేళ నీట్ లీక్‌పై ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు



**మొదటిపేజీ తరువాయి -** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారికి అత్యంత కఠినమైన శిక్ష విధించాలని ఆయన పిలుపునిచ్చారు. పేపర్ లీక్‌లను నిరోధించడం జాతీయ బాధ్యత అని ఉద్ఘాటించారు. ఇవాళ జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ 'మంగళ్ మిలన్' సమావేశం అనంతరం కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేని పటిష్ఠమైన (ఫూల్‌ప్రూఫ్) వ్యవస్థను నిర్మించేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ప్రధాని కోరినట్లు రిజిజు తెలిపారు. చట్టసభల్లో ప్రభుత్వానికి మద్దతుగా ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు ఐక్యంగా ఉండాలని ప్రధాని కోరారు. అదే సమయంలో ప్రతిపక్షాలు కూడా పార్లమెంటులో నిర్మాణాత్మకంగా వ్యవహరించాలని, దేశ భవిష్యత్తు, యువత సంక్షేమం కోసం ఎంపీలందరిపైనా ఉమ్మడి బాధ్యత ఉందని మోదీ అన్నట్లు రిజిజు వివరించారు. నీట్ కుంభకోణంపై విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతున్న నేపథ్యంలో ప్రధాని వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. నిన్న పార్లమెంటు వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన వందలాది మంది విద్యార్థులపై పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించి, లాఠీఛార్జ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. గతంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నిరుద్యోగ యువతను 'బొద్దింకలతో' పోల్చిన వ్యాఖ్యల నేపథ్యంలో ఏర్పడిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఈ నిరసనలకు నాయకత్వం వహిస్తోంది. నీట్ పేపర్ లీక్ విషయం తెలిసిన వెంటనే ప్రభుత్వం స్పందించిందని, నిందితుల అరెస్టులకు దారితీసిందని ప్రధాని చెప్పినట్లు రిజిజు వెల్లడించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వెంటనే తిరిగి పరీక్ష నిర్వహించామని మోదీ నొక్కిచెప్పారన్నారు. మరోవైపు ఈ ఉద్యమానికి మద్దతుగా 21 రోజుల పాటు నిరాహార దీక్ష చేసిన సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌ను పోలీసులు బలవంతంగా ఆసుపత్రికి తరలించారు. విద్యార్థులపై పోలీసుల దమనకాండను చూశాక, ఆసుపత్రి నుంచే తన దీక్షను కొనసాగిస్తానని ఆయన ప్రకటించారు. ఇదిలా ఉంటే.. తమను ప్రభుత్వం చర్చలకు పిలిచిందని, కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో తమ నేతలు సమావేశమై డిమాండ్లతో కూడిన లేఖను సమర్పించారని సీజేపీ తెలిపింది. ఈ సమావేశం స్నేహపూర్వక వాతావరణంలో జరిగిందని అంగీకరించిన నడ్డా, చర్చల ప్రతిపాదన నిరసనకారుల నుంచే వచ్చిందని స్పష్టం చేశారు.

## ఏపీలో యూఏఈ ఫుడ్ క్లస్టర్

**మొదటిపేజీ తరువాయి -** ఒక పూర్తిస్థాయి వ్యాల్యూచైన్ ఏర్పాటు చేయాలని యూఏఈ నిర్ణయించింది. దీనికోసం ఏపీ ప్రభుత్వం, యూఏఈ మధ్య అధికారికంగా భాగస్వామ్యం కుదిరింది. ఈ భాగస్వామ్యం ద్వారా రాష్ట్రంలో అధికంగా పండే మామిడి, అరటి, కోకో వంటి ఉద్యాన ఉత్పత్తులను శుద్ధి చేసి, నాణ్యతా ప్రమాణాలతో ప్యాక్ చేసి, అంతర్జాతీయ మార్కెట్లకు తరలించేందుకు అవసరమైన వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఇది రాష్ట్రంలోని రైతులకు మేలు చేయడంతో పాటు, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ కీలక సమావేశంలో యూఏఈ ప్రతినిధులతో పాటు రాష్ట్ర మంత్రి టీజీ భరత్, ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమల శాఖల ఉన్నతాధికారులు, ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఈడీబీ) అధికారులు పాల్గొన్నారు.

## 2021 నాటికే పూర్తి కావాల్సిన పోలవరాన్ని వైసీపీ నాశనం చేసింది

**మొదటిపేజీ తరువాయి -** రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు గాడిన పడుతున్నాయని పేర్కొన్నారు. సచివాలయంలో జలవనరుల శాఖపై ఈరోజు ఆయన శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కీలకమైన ప్రాజెక్టులు, వాటి తాజా స్థితిగతులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరాలు వెల్లడించారు. 2014-19 మధ్యకాలంలో పోలవరం పనులు వేగంగా జరిగి 72 శాతం మేర పూర్తయ్యాయని, అయితే జగన్ 'ఒక్క ఛాన్స్' అంటూ వచ్చి రివర్స్ టెండరింగ్ పేరుతో తీవ్ర నష్టం చేశారని విమర్శించారు. కాంట్రాక్టు ఏజెన్సీలను రద్దు చేయవద్దని ఎంతమంది హెచ్చరించినా వినకుండా, 17 నెలల పాటు పనులను నిలిపివేశారని మండిపడ్డారు. దీని ఫలితంగానే 2020లో వచ్చిన వరదలకు డయాఫ్రమ్‌వాల్ పూర్తిగా దెబ్బతిన్నదని నిపుణులు స్పష్టం చేశారని తెలిపారు. ఆఖరికి పోలవరం నిర్వాసితులను కూడా గత ప్రభుత్వం మోసం చేసిందని దుయ్యబట్టారు. ధ్వంసమైన జలవనరుల రంగాన్ని పునర్నిర్మించి పూర్వ స్థితికి తీసుకువస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. 2028 డిసెంబర్ నాటికి రాష్ట్రంలో 36 ప్రధాన ప్రాజెక్టులను ఏ స్థాయిలో పూర్తి చేస్తామనే దానిపై స్పష్టమైన కార్యాచరణను వివరించారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి జిల్లాకు తాగు, సాగు నీటిని సరఫరా చేయడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు.

## మంగళగిరిలో నారా లోకేశ్ 7.30 గంటల నాన్ స్టాప్ 'పట్టా'భిషేకం



**మొదటిపేజీ తరువాయి -** మన లోకేశ్' కార్యక్రమం మంగళగిరిలో ఓ పండుగలా జరిగింది. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా తొలిరోజు 1331 మంది లబ్ధిదారులకు శాశ్వత ఇళ్ల పట్టాలను అందజేశారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 9:30 గంటలకు ప్రారంభమైన పట్టాల పంపిణీ సాయంత్రం 5 గంటల వరకు నిరంతరాయంగా కొనసాగింది. లబ్ధిదారుల 'పట్టా'భిషేకం అనదగ్గ ఈ కార్యక్రమంలో మంత్రి లోకేశ్ దాదాపు ఏడున్నర గంటల పాటు నిలబడే ఉండడం విశేషం. ప్రతి లబ్ధిదారుడికి ఆయనే స్వయంగా పట్టాలు అందించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. పట్టా పత్రాలతో పాటు లబ్ధిదారులందరికీ నూతన వస్త్రాలను కూడా మంత్రి లోకేశ్ బహూకరించారు. సుదీర్ఘ సమయం పాటు ఒకేచోట నిలబడి ఓపికగా పట్టాలు పంపిణీ చేయడంపై కార్యక్రమంలో పాల్గొన్న పలువురు నాయకులు, ప్రజలు ప్రశంసలు తెలిపారు.

## ఆగస్టు 30లోగా తనిఖీలు పూర్తి కావాలి



**మొదటిపేజీ తరువాయి -** పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన గడువు విధించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పూర్తి సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడమే ప్రభుత్వ ప్రాధాన్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ విధివిధానాల్లో భాగంగా ప్రతి ఆర్‌సీవో కచ్చితంగా వారానికి మూడు రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించి, కనీసం ఆరు గురుకుల విద్యాసంస్థలను నేరుగా సందర్శించాలని మంత్రి ఆదేశించారు. విధుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించిన ఆయన, స్వయంగా తాను కూడా ప్రతి నెలా కనీసం 15 గురుకులాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని వెల్లడించారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా ఎక్కడా ఫుడ్ పాయిజనింగ్ వంటి ఘటనలు జరగకుండా ఆహార నాణ్యతపై ప్రత్యేక నిఘా పెట్టాలని అధికారులకు సూచించారు. చదువుతో పాటు క్రీడలు, కళలు, వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్య మిస్తూ, ఒత్తిడి తగ్గించేందుకు సైకాలజిస్టులతో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు. మరొక వైపు సొంత భవనాలు లేని గురుకులాలకు భూముల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మూసీ గురుకులానికి సొంత భవన నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకులాలకు కేటాయించే నిధుల్లో ఆరు శాతాన్ని అత్యవసర మరమ్మతులకు వినియోగించుకునేలా అనుమతించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి గురుకులంలో రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని, విద్యార్థుల భాగస్వామ్యంతో విస్తృతంగా మొక్కలు నాటించి వాటిని సంరక్షించే బాధ్యతలను కూడా వారికి అప్పగించాలని ఆర్‌సీవోలకు మంత్రి పొన్నం ప్రభాకర్ దిశానిర్దేశం చేశారు.

## నీట్ లీకేజీ వ్యవహారం అత్యంత బాధాకరం



**మొదటిపేజీ తరువాయి -** బీజేపీ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. నీట్‌తో పాటు ఏ ప్రజా సమస్యపై అయినా పార్లమెంట్‌లో సమగ్రమైన సమాధానం ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. అయితే పార్లమెంట్ సమావేశాలు కేవలం నిబంధనల ప్రకారమే సాగుతాయని, విపక్షాల ఆలోచనలకు అనుగుణంగా జరగవని తేల్చిచెప్పారు. జంతర్ మంతర్ వద్ద ధర్నాలు చేసి ఫొటోలు దిగాలనే ఉద్దేశంతోనే విపక్షాలు సభను వాయిదా వేయిస్తున్నాయని ఆయన విమర్శించారు. సభా నిబంధనల ప్రకారం నీట్ అంశంపై చర్చించేందుకు స్పీకర్ అంగీకరించినప్పటికీ, జీరో అవర్‌ను రద్దు చేసి ఇప్పుడే చర్చ పెట్టాలంటూ విపక్షాలు పట్టుబట్టడం విడ్డూరంగా ఉందన్నారు. విద్యార్థులకు ఇప్పటికే నీట్ రీ-ఎగ్జామ్ నిర్వహించి ఫలితాలు కూడా వెల్లడించామని గుర్తుచేశారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో చట్టసభను ముట్టడిస్తామంటే ఏ ప్రభుత్వమైనా భద్రత దృష్ట్యా నిరసనకారులను అడ్డుకుంటుందని, దానిని వివాదం చేయడం సరికాదని వ్యాఖ్యానించారు. అలాగే అయోధ్య విరాళాల చోరీ ఉదంతంతో బీజేపీ లేదా ఆర్‌ఎస్‌ఎస్‌కు ఎలాంటి సంబంధం లేదని రఘునందన్ రావు స్పష్టం చేశారు. ఈ చోరీ కేసుపై సిట్ లోతుగా విచారణ జరుపుతోందని తెలిపారు. ఆలయంలో పనిచేసే ఒక వ్యక్తి దురాశతో చేసిన తప్పును తీసుకొచ్చి ఒక పార్టీకి ఆపాదించడం దుర్మార్గమని మండిపడ్డారు. వచ్చే ఏడాది ఉత్తరప్రదేశ్‌లో ఎన్నికలు రాబోతున్నందునే, రాజకీయ లబ్ధి కోసం విపక్షాలు బీజేపీపై లేనిపోని ఆరోపణలు గుప్పిస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఉత్తమ్ కుమార్ రెడ్డి మాటలు నమ్మిన రైతులు తీవ్రంగా నష్టపోయారు



**మొదటిపేజీ తరువాయి -** నారుమడులు పోసుకున్న రైతులు ఇప్పుడు నీళ్లు లేక తీవ్రంగా నష్టపోయారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి మాటలు నమ్మి నాట్లు వేసుకుంటే, ఇప్పుడు నీళ్లు రాక ఆ నారుమడులన్నీ ముదిరిపోయి పుచ్చిపోయే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. దేవాదుల నుంచి 38.16 టీఎంసీల నీటిని ఎత్తిపోసి, 22 రిజర్వాయర్లను నింపి ప్రతి ఎకరాకు సాగునీరు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం డైలాగులు కొట్టిందని విమర్శించారు. అసలు ఆ నీళ్ల మంత్రికి దేవాదుల కింద ఎన్ని రిజర్వాయర్లు ఉన్నాయో కూడా తెలియదని హరీశ్ ఎద్దేవా చేశారు. అసలు కాంగ్రెస్ ప్రభుత్వానికి నీళ్ల నిర్వహణపై కనీస అవగాహన లేదని విమర్శించారు. దేవాదుల అనేది బీఆర్ఎస్ నిర్మించిన ప్రాజెక్టు అని, ఆ విషయం కూడా కాంగ్రెస్ నాయకులకు తెలియకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాళేశ్వరం విషయంలో కుంటిసాకులు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేసిన ప్రభుత్వం... మరి దేవాదుల వద్ద నీళ్లు ఎత్తడానికి ఏం అడ్డంకి వచ్చిందో సమాధానం చెప్పాలని నిలదీశారు. తాను ప్రెస్ మీట్ పెట్టి నిలదీసిన తరవాతే మంత్రులు హెలికాప్టర్ వేసుకుని అక్కడికి పరిగెత్తారని తెలిపారు. రేపే మోటార్లు నడుపుతామని మంత్రులు ఒకరిని మించి ఒకరు ఉపన్యాసాలు దంచారని, కానీ ఎనిమిది రోజులు గడిచినా ఇప్పటికీ 10 మోటార్లు కూడా స్టార్ట్ కాలేదని ఎద్దేవా చేశారు. మంత్రులు వెళ్లిన రోజు ఏడు మోటార్లు నడిస్తే, తెల్లారేసరికి అవి ఐదుకి పడిపోయాయని, కాంగ్రెస్ మంత్రుల మాటలు కోటలు దాటుతున్నాయే తప్ప చేతల్లో శూన్యమని అన్నారు.

# అన్నపురెడ్డిపల్లి శైవక్షేత్రంలో ఇష్టారాజ్యపాలన..
# శిథిలావస్థలో ధ్వజస్తంభ రాగి కవచాలు!

**నిత్య పూజలు, కైంకర్యాలపై నిర్లక్ష్యం.. ఆలయ ప్రక్షాళన చేపట్టకపోతే భారీ ఆందోళనకు భక్తుల హెచ్చరిక**




**చంద్రుగొండ, ప్రతినిధి జూలై 21( వార్త సంధ్య) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని చారిత్రాత్మక శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో అధికారుల నిర్లక్ష్యంపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ ప్రముఖ శైవక్షేత్రంలో పర్యవేక్షణ లోపించడంతో ఆలయ నిర్వహణ గాడితప్పిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఆలయంలో నిత్య పూజలు, కైంకర్యాలు సక్రమంగా నిర్వహించడం లేదని, ఈవోతో పాటు సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆలయాన్ని ఎప్పుడు తెరుస్తారో, ఎప్పుడు మూసేస్తారో స్పష్టత లేకపోవడంతో భక్తులు నిరాశతో వెనుదిరుగుతున్న పరిస్థితి నెలకొందని విమర్శించారు. మరోవైపు ఆలయంలో అత్యంత పవిత్రంగా భావించే ధ్వజస్తంభంపై ఉన్న రాగి కవచాలు కాలక్రమేణా దెబ్బతిని శిథిలావస్థకు చేరాయని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కవచాలు ఊడిపోతుండటం, రంగు మారిపోవడం వంటి సమస్యలు కనిపిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. శాస్త్రోక్తంగా పాత రాగి కవచాలను తొలగించి, కొత్త రాగి కవచాలను అమర్చి ధ్వజస్తంభ పునరుద్ధరణ చేపట్టాలని, ఆలయ ప్రాంగణంలో సమగ్ర ప్రక్షాళన నిర్వహించాలని భక్తులు డిమాండ్ చేశారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని ఆలయ నిర్వహణలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు. లేకపోతే భక్తులు, హిందూ సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# రాజకీయ ఉద్దండులకు ఘన సత్కారం

**ఈనెల 25న లార్వేస్ క్రాఫ్ట్స్ ఆధ్వర్యంలో 'స్టేట్స్ మెన్ ఎక్సలెన్స్' కాన్క్లేవ్**




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూలై 21. :** మునుపెన్నడూ లేని విధంగా సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగి ప్రజా సంక్షేమం కోసం పాటుపడి విశిష్ట సేవలు అందించిన రాజకీయ ఉద్దండులకు అవార్డులను ప్రధానం చేసి సత్కరించుకునే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది "లార్వేన్ క్రాఫ్ట్స్ సంస్థ". ఈ సంస్థ ద్వారా "స్టేట్స్ మెన్ ఎక్స్ లెన్స్" అవార్డు పేరుతో 65ఏళ్ళ పైబడిన ఎంపిక చేసిన రెండు తెలుగు రాష్ట్రాలకు సంబందించిన నాయకులకు అవ్వార్థులు ప్రధానం చేయనున్నారు. ఈనెల 25 వ తేదీన లార్వేన్ క్రాఫ్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో స్టేట్స్ మెన్ ఎక్స్ లెన్స్ అవార్డుల కార్యక్రమానికి సంబంధించిన కాంక్లెవ్ నిర్వహించనున్నారు. దీనికి సంబందించిన పోస్టర్ ను సోమాజిగూడ లోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్ లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ఆ సంస్థ గౌరవ సలహాదారు, సీనియర్ పాత్రికేయులు, మాజీ ఆర్టీఐ కమిషనర్ శ్రీ విజయ్ బాబు ఆధ్వర్యంలో అట్టహాసంగా జరిగింది. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు శ్రీ విజయకుమార్ రెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన పోస్టర్ ను ఆవిష్కరించారు. విశిష్ట అతిధులుగా మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, హైడ్రా పిఆర్ఓ శ్రీ వేణుగోపాల్ నాయుడు తెలంగాణ మాస పత్రిక ఎక్సిక్యూటివ్ ఎడిటర్ శ్రీ కోదూరి శ్రీనివాస్ రావ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిధులు మాట్లాడుతూ రాజకీయ నాయకులకు అవార్డులు ప్రధానం చేయడం శుభసూచకమని, భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకంగా ఉంటుందని అన్నారు. ఇంతటి సాహసోపేతమైన కార్యక్రమానికి పూనుకున్న లార్వేన్ క్రాఫ్ట్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శివాల గిరిబాబు ని అతిధులు అభినందించారు. అదే విధంగా లార్వేన్ క్రాఫ్ట్స్ సంస్థ క్రియేటివ్ డైరెక్టర్ సుధాజైన్ , నిర్వహణ కమిటీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి కార్యనిర్వహణ హెడ్స్ నాగేష్, చంద్రశేఖర్ లు పాల్గొన్నారు.

# హైదరాబాద్ లోని అమెరికా
# కౌన్సిల్ జనరల్ లారా విలియమ్స్ సీఎస్ ను కలిసిన



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూలై 21:** హైదరాబాద్ లోని అమెరికా కౌన్సెల్ జనరల్ లారా విల్లియమ్స్ డా.బీ.ఆర్ అంబెడ్కర్ సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో మంగళవారం నాడు సమావేశమయ్యారు. మర్యాదపూర్వక ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారులి.

# శ్రీ చిత్తారమ్మ తల్లి ఆలయంలో వైభవంగా బోనాల ఉత్సవాలు.. ప్రత్యేక పూజలు నిర్వహించిన బండి రమేష్



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** ఆషాఢమాస బోనాల సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గం, మూసాపేట్‌లోని ప్రసిద్ధ శ్రీ చిత్తారమ్మ తల్లి దేవాలయంలో బోనాల ఉత్సవాలు భక్తుల కోలాహలం మధ్య అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ విచ్చేసి ఆలయాన్ని సందర్శించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, అష్టైశ్వర్యాలు సమృద్ధిగా కలగాలని మనస్పూర్తిగా ప్రార్థించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ సజీవ ప్రతీక అని పేర్కొన్నారు. ఇలాంటి పండుగలు ప్రజల మధ్య ఐక్యతను, భక్తిభావాన్ని మరింత పెంచుతాయని తెలిపారు. అమ్మవారి దివ్య ఆశీస్సులతో రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు మరియు స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# బల్కంపేట శ్రీ ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న బండి రమేష్



**వార్తా సంధ్య కూకట్‌పల్లి:** హైదరాబాద్‌లోని ప్రసిద్ధ బల్కంపేట శ్రీ ఎల్లమ్మ తల్లి దేవాలయాన్ని టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ ఈరోజు సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఘనంగా నిర్వహించిన శ్రీ ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవంలో ఆయన ఉత్సాహంగా పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు సమర్పించి, భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో సుభిక్షంగా అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో పాటు సామరస్యపూర్వకంగా జీవించాలని అమ్మవారిని మనసారా ప్రార్థించినట్లు తెలిపారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ అర్చకులు బండి రమేష్‌కు వేదమంత్రోచ్చారణలతో స్వాగతం పలికి, తీర్థప్రసాదాలు అందజేసి అమ్మవారి ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో తూము వేణు, లక్ష్మయ్య, క్రాంతి, కలికోట శంకర్, రాము, శ్రీకాంత్ పటేల్, మోహిత్ తదితరులతో పాటు పలువురు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# నేను ఉపనిషత్ స్ఫూర్తికి భక్తుణ్ణి... విగ్రహానికి కాదు

**సోషల్ మీడియాలో లివెల్లువెత్తుతున్న అసత్య ప్రాణాలను తిప్పిగొట్టిన విజయవిహారం రమణమూర్తి**






**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూలై 21 :** హైదరాబాద్, సోమాజి గూడ ప్రెస్ క్లబ్, భవిష్యత్ ఉపనిషత్తుల తాత్విక స్ఫూర్తికి కట్టుబడి మాట్లాడుతున్నాను. రాముడు కేంద్రంగా వున్నదే హిందూయిజంగా నేను అంగీకరించడం లేదంటే - రాముడిని దూషిస్తున్నానని ఎంతమాత్రం కాదు. నేను ద్వేషాన్ని అసమానతను వ్యతిరేకిస్తున్నాను. అది వేదాల్లో, ఇతిహాసాల్లో, పురాణాల్లో, ఖురాన్ లో, బైబిల్లో ఎక్కడున్నా సరే.."అని విజయ విహారం రమణమూర్తి అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను జైశ్రీరామ్, సీతారామ్ అని పారవశ్యంతో అంటాను కానీ అది ఒక తాత్వికమైన అక్షర తత్వాన్ని, చరాచంస్థితమైన పరబ్రహ్మ తత్వాన్ని ఉద్దేశించే అంటానని అన్నారు. ఆయన తన సుదీర్ఘ ప్రసంగంలో సోషల్ మీడియాలో వెల్లువెత్తేవన్నీ అసత్య ప్రచారాలు అని ఖండిస్తూ - అనేక విషయాలను ప్రస్తావించారు. "అయోధ్య రామాలయానికి సంబంధించి అవకతవకలు జరిగాయని అక్కడి ప్రధాన పూజారి బాబాలాల్ దాస్ లాంటి వాళ్లు చేసిన ఆరోపణలనే నేను ప్రస్తావిస్తే నేరమైందా? దానిమీద సమగ్రమైన దర్యాప్తు జరిపించే బాధ్యతను ప్రభుత్వం ఎందుకు గుర్తించదు. దీన్ని హిందూ సమాజం తరఫున ప్రశ్నిస్తే అది నేరమా? అలాగే కృష్ణ భగవానుడి చిత్రాల్లోని తల భాగంలో మోడీ తల తాలూకు చిత్రాన్ని అతికించడం దైవాపచారం కాదా? రామచంద్రుడిని మోడీ భుజంపై సేదతీరే దృశ్యం హిందూ సమాజానికి అంగీకారమేనా? బాలరాముడి వేలుపట్టుకొని నడిపించడం భావ్యమేనని ఏ హిందువు భావిస్తాడు? గోరక్షకుల పేరిట అమాయక వ్యక్తులపై హత్యలకు దిగడాన్ని ఇటీవలే ఓ డిబేట్లో ప్రస్తావించినప్పుడు - ఇదే కశ్యప్ రెడ్డి కోపంతో ఊగిపోతూ వేలు చూపుతూ, కచ్చితంగా చంపితీరుతాం అని అనేకసార్లు బెదిరించాడు. భాగవత్ , మోదీ కూడా ఇలాంటి హత్యాకాండ ఏమాత్రం తగదని వారించారని గుర్తుచేస్తే - వారేమీ హిందూ మతానికి టేకేదార్లు కాదు మేం చేయాలనుకున్నది చేసితీరతాం అని కశ్యప్ రెడ్డి బెదిరించడం ఉన్మాదం కాదా! గోవధ ఎక్కడ జరిగినా వాళ్లని చంపిపారేసే హక్కు మాకు కావాలని అడిగిన అతగాడి మానసిక స్థితి ఎలాంటి పెడధోరణిలో వుందో ఊహించవచ్చు. మొన్న నాపై దాడిజరిగిన డిబేట్లో కేవలం తలకాయ అన్న మాటను అన్నందుకు నన్ను చంపేయాలన్నంత ఉన్మాదానికి దిగాడు.. తలకాయ అన్నది అచ్చమైన తెలుగుమాటే కాని బూతు పదమేం కాదు. ఇందులో కృష్ణుడిని అవమానపరిచిందేమిటి? నా నేపథ్యం గురించి కూడా పూర్తి అసత్యమైన, అసందర్భమైన ప్రచా రాలు కొన్ని చానెళ్లలో జరుగుతున్నాయి. గతంలో ఓ మహిళా వేదికపై మాట్లాడే వీడియోను కత్తిరించి, నన్ను దైవదూషకుడిగా చిత్రిస్తు న్నారు. హిందూ, ముస్లిం, క్రైస్తవం...ఏమతంలోనైనా అస మానత్వా లకి వ్యతిరేకమైన అంశాలుంటే వ్యతిరేకించడానికి ఎప్పుడూ వెనకాడలేదు. ఎలాంటి శషభిషల్లేవు. నేను స్ఫూర్తికి భక్తుణ్ణి. విగ్రహానికి కాదని ఎన్నో సందర్భాల్లో చెప్పాను. అవును రామా యణంలో శూర్పణఖ, శంభూకవధ గురించి ప్రస్తావించాను. అదేస మయంలో రామచంద్రుడి ఉత్తమగుణాలను, విలువల్ని కూడా ఎన్నో సార్లు ప్రస్తావించాను... అభ్యంతరకరమైన విషయాలను విమర్శిం చడంలో ఎప్పుడూ వెనక్కి తగ్గలేదు. ఇప్పుడు కూడా అదే చెబుతున్నా. తిరస్కరించాల్సిన అంశాల్ని బాహాటంగా చెబితే తప్పై పోయిందా? నేను కొత్తగా మారిందీ లేదు వేషమేదో మార్చిందీ లేదు వేదాల్లోనూ, ఉపనిషత్ లలోనూ గొప్ప విషయాల గురించి చెబుతూనే వున్నాం. హిందూమతంలోని ఉన్నత విలువల్ని, ద్వేషం అసమానత్వాలకి వ్యతిరేకంగా వున్న అంశాల గురించి విస్తారంగా ఎలుగెత్తి చాటుతూనే వున్నాం...

మరి నేనెట్లా హిందూ వ్యతిరేకినయ్యానో విమర్శకులకే తెలియాలి... అబేధ దర్శనం జ్ఞనం అన్న మాట నాకు ఆచరణీయం. అనుసరణీయం. మరోసారి చెబుతున్నా. నేను హిందువుగానే పుట్టాను. హిందువుగానే వుంటాను. హిందువుగానే మరణిస్తాను.. హిందూమతంలో ఎన్నో స్రవంతులున్నాయి. వీటిలో ఆర్యసమాజం, అలేఖ సంప్రదాయం వంటివి రాముడిని అంగీకరించలేదు. మరి ఆ సంప్రదాయాలన్నింటినీ హిందూమతం నుంచి వేరు చేద్దామా? సర్వమూ ఈశ్వరమయమే అన్న ఉపనిషత్తు స్ఫూర్తికి నేను కట్టుబడివున్నవాణ్ణి. ఉపనిషత్తులు నాకు అత్యంత పరవశాన్ని, అలౌకకమైన స్ఫూర్తిని కలిగిస్తూవుంటాయి. ఇప్పుడు నేను దైవదూషణ చేసినట్టు వైరలవుతున్న వీడియోలో మహిళల్ని రాజకీయంగా, సామాజికంగా, కుటుంబపరంగా ఎట్లాంటి దారుణమైన వివక్షను, అవమానాల్ని ఎదుర్కొంటున్నారో వివరించాను. ఆ సందర్భంలో మన పురాణాల్లోని, ఖురాన్ లోని, బైబిల్, బౌద్ధ మతాల్లోని వివక్షతా పూర్వక అంశాలను ప్రస్తావించాను కాని మన పౌరాణిక పదేవుళ్లగురించిన క్లిప్పింగును మాత్రమే ఎడిట్ చేసి వైరల్ చేయడం దారుణం, అనైతికం..నన్ను దైవద్రోహిగా చిత్రించాలని చూస్తున్నారు. కానీ వివక్షకీ, ద్వేషానికీ, అసమానత్వాలకి సంబంధించిన అంశాలెక్కడున్నా ఇవాల్టికీ విమర్శి స్తాను...ఈ విషయంలో నేనేమీ మాట మార్చడం లేదు... కొత్తగా ఏ వేషమూ కట్టలేదు..అని రమణమూర్తి అన్నారు.

రామాయణంలో శూర్పణఖ ఉదంతాన్ని చాలామంది విజ్ఞులు, మేధావులు, పండితులు విమర్శించారు. నాక్కూడా అది విమర్శనీయమేఅదే నేను చెప్పాను అలాగే కృష్ణ భగవానుడి రాసలీలా ఘట్టం కూడా నాకు అత్యంత పారవశాన్ని కలిగిస్తుంది. విజయవిహారం పత్రికా నాటి నుండి నామీద పెట్టిన కేసులన్నీ కల్పితాలూ, అసత్యాలనీ గౌరవ కోర్టులు ఇప్పటికే తీర్పులు వెలువరించాయి. ఐనప్పటికీ నా మీద వ్యక్తిగత దుష్ప్రచారం సోషల్ మీడియాలో చేస్తున్నారో తీవ్రంగా ఖండి స్తున్నాను. వచ్చే 24 గంటల్లో నా మీద అసత్య వార్తలతో చేసిన వీడియో లను వెంటనే తొలగించాలని, లేని పక్షంలో న్యాయ పరిణా మాల్ని ఎదుర్కోవడానికి సిద్ధంగా వుండాలని హెచ్చరి స్తున్నాను ఈసమావేశంలో హిందూస్ ఫర్ ప్లూరాలిటీ అండ్ ఈక్వాలిటీ సంస్థ అధ్యక్షులు, అలేఖ్ సంప్రదాయానికి చెందిన సాధు త్రినాథ దాస్ మాట్లాడుతూ వైవిధ్యం కలిగినదే హిందూమతమని, వేల ఏళ్లుగా విభిన్న స్రవంతులు మధ్య సమన్వయంతో, సామరస్యంతో ఈ ధార కొన సాగుతోందని - కాని ద్వేషంతో తెగబడుతున్న శక్తులనుంచి హిందూ మతాన్ని కాపాడుకుంటామని తెలిపారు. హిందూస్ ఫర్ ప్లూరాలిటీ అండ్ ఈక్వాలిటీ హెచ్ పి ఈ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమా వేశంలో జాతీయ అధ్యక్షులు స్వామి త్రినాథ దాస్ గురూజీ, జైభారత్ జాతీయ కార్యదర్శులు రజనీ, లోక్ నాథ్, అచలతత్వ్య ప్రచారకులు దున్న ఇద్దాసు పీఠం వారసులు దున్న లక్ష్మీశ్వర్ పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఎకో టూరిజం అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక

**- సి.ఎస్ సంజయ్ జాజు.**





**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూలై 21 :** రాష్ట్రంలో ఎకో టూరిజం అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఎకో టూరిజం అభివృద్ధి, పులుల సంరక్షణ, టైగర్ రిజర్వుల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో అటవీ శాఖ, పర్యాటక శాఖ సంబంధిత విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సి.ఎస్ కు వివరించారు. ఈ సందర్భంగా సి.ఎస్. మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎకో టూరిజం ను అభివృద్ధి పరచి తద్వారా యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి కల్పించడంతో పాటు పర్యటక రంగం ద్వారా రాష్ట్ర ఆదాయం పెరిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని అన్నారు. ప్రత్యేకంగా భద్రాచలం పరిసర ప్రాంతాలలో ఉన్న కిన్నెరసాని, శ్రీశైలం నల్లమల అటవీ ప్రాంతాలలో అమ్రాబాద్, గోదావరి నది తీర ప్రాంతంలో ఉన్న కవ్వాల్ టైగర్ రిజర్వు, ఆదిలాబాద్, ములుగు ప్రాంతాలలో ఎకో టూరిజం అభివృద్ధికి తగు కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పథకాల ద్వారా రాష్ట్రానికి కేటాయించిన నిధులను పూర్తి స్థాయిలో వినియోగించుకొని ఎకో టూరిజం ను అభివృద్ధి చేయాలని అన్నారు. రాష్ట్రంలో విలువైన అటవీ సంపద ఉందని, జీవ వైవిధ్యం, సహజ ప్రకృతి అందాలను పర్యాటక అభివృద్ధికి సమర్థవంతంగా వినియోగించేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఎకో టూరిజం అభివృద్ధికి పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా ప్రాజెక్టులు రూపొందిస్తే , ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు జి.డి.పి ఆదాయం పెరిగే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్, టూరిజం డెవల్మెంట్ కార్పొ రేషన్ సంయుక్త భాగస్వామ్యంతో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సి.ఎస్ సూచించారు. ముఖ్యంగా ఫ్యూ చర్ సిటీ , అనంతగిరి ,వికారాబాద్,సిటీ అర్బన్ ప్రాంతాలలో ఎకో టూరిజంను ప్రోత్సహించాలని అన్నారు. అటవీ ప్రాంతాల్లో పర్యా వరణ సమతుల్యతను కాపాడుతూ, నిబంధనలకు అనుగుణంగా పర్యాటక మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని, సందర్శకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీమ్, వినయ్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ మెడికల్ బోర్డు ఫలితాలపై పునఃసమీక్ష చేయాల

**అనారోగ్య కార్మికులకు న్యాయం చేయాలి**

**మెడికల్ బోర్డును రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని వినతి**




**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 21 (వార్త సంధ్య):** ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించిన సింగరేణి కార్పొరేట్ మెడికల్ బోర్డు ఫలితాలను పునఃసమీక్షించి బాధిత కార్మికులకు న్యాయం చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటీయూసీ) యాజమాన్యాన్ని డిమాండ్ చేసింది. ఎఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ పిలుపు మేరకు మంగళవారం సింగరేణి వ్యాప్తంగా అన్ని గనులు, విభాగాల్లో వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సింగరేణి వ్యాప్తంగా సుమారు 2,000 మంది కార్మికులు ఏళ్లుగా మెడికల్ బోర్డు కోసం ఎదురుచూస్తుండగా, కేవలం 120 మందికి మాత్రమే మెడికల్ బోర్డు నిర్వహించడం తీవ్ర అన్యాయమని విమర్శించారు. అలాగే 28 మంది కార్మికులకు బోర్డుకు హాజరుకావాల్సిన సమాచారం కూడా సకాలంలో అందకపోవడం యాజమాన్య నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. హాజరైన 120 మందిలో కేవలం 24 మందిని మాత్రమే ఇన్వాలిడేషన్‌కు అర్హులుగా ప్రకటించడం, గతంలో నిర్వహించిన మెడికల్ బోర్డులతో పోలిస్తే అత్యంత తక్కువ శాతమని ఆవేదన వ్యక్తం చేశారు. బొగ్గు గనుల్లో, ముఖ్యంగా అండర్‌గ్రౌండ్‌లో దశాబ్దాలుగా పనిచేస్తున్న కార్మికులు కీళ్ల నొప్పులు, వెన్నెముక సమస్యలు, శ్వాసకోశ వ్యాధులు వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నప్పటికీ, వాటిని సమగ్రంగా పరిగణనలోకి తీసుకోకుండా ఫలితాలు ప్రకటించడం వల్ల నిజమైన అనారోగ్య కార్మికులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. గతంలో దరఖాస్తు చేసుకుని ఇప్పటికీ మెడికల్ బోర్డు కోసం ఎదురుచూస్తున్న కార్మికులందరికీ తక్షణమే మరోసారి కార్పొరేట్ మెడికల్ బోర్డు నిర్వహించాలని, ప్రతి కార్మికుడి ఆరోగ్య పరిస్థితిని నిష్పాక్షికంగా పరిశీలించి అర్హులైన వారిని ఇన్వాలిడేషన్ చేసి, వారి వారసులకు ఉద్యోగాలు కల్పించడం ద్వారా కార్మిక కుటుంబాలకు న్యాయం చేయాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి గట్టయ్య, ఉపాధ్యక్షులు కత్తర్ల రాములు, ఆఫీస్ బేరర్స్ సందబోయిన శ్రీనివాస్, హీరాలాల్, కర్రు రమేష్, గుమ్మడి వీరయ్య, పిట్ కార్యదర్శులు ఎం.ఆర్.కే. ప్రసాద్, మధుకృష్ణ, కమల్, సురేందర్, నాయకులు రాజాలపూడి సాంబమూర్తి, బండారి మల్లయ్య, సాయి పవన్, సందీప్, శశివర్ధన్ రెడ్డి, సురేంద్రరెడ్డి, వెంకటరమణ, కుమార్ రావు, మురళి, అప్పారావు, కొవ్వూరు రాజేశ్వరరావు, అవినాష్, గావిని నాగరాజు, సుబ్రహ్మణ్యం, మెంగన్ రవి, కోటి, ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ అధికారులు వర్సెస్ మున్సిపల్ కార్పొరేటర్లు..!

**అధికారులపై రాజకీయ పెత్తనం..?**

**ఫోన్‌ల్లో అసభ్య పదజాలం.. బెదిరింపులు..**

**అధికారుల్లో ఆందోళన..!**

**ఫిర్యాదులు చేసినా స్పందించని పై అధికారులు..?**

**కొత్తగూడెం కార్పొరేషన్‌లో సంచలనంగా మారిన**

**అధికార--ప్రజాప్రతినిధుల విభేదాలు..!**




**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 21 (వార్త సంధ్య) :** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రెవెన్యూ అధికారులు, కొందరు మున్సిపల్ కార్పొరేటర్ల మధ్య నెలకొన్న విభేదాలు రోజురోజుకు ముదురుతున్నాయనే చర్చ సాగుతోంది. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల కంటే అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు, ఫోన్‌ల ద్వారా దురుసు వ్యాఖ్యలు, విధుల్లో జోక్యం వంటి అంశాలు ఇప్పుడు కార్పొరేషన్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. ఇటీవల ఎస్ఐఆర్ కార్యక్రమం అమలు సందర్భంగా కొందరు కార్పొరేటర్లు రెవెన్యూ అధికారులతో అనుచితంగా మాట్లాడుతున్నారని, విధులు నిర్వహిస్తున్న అధికారులను బెదిరించే ధోరణి ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విధులు నిర్వర్తిస్తున్న అధికారులను రాజకీయ కోణంలో చూడడం సరికాదని ఉద్యోగ వర్గాలు పేర్కొంటున్నాయి. రెవెన్యూ అధికారులు ఏ ఒక్క పార్టీకి చెందిన వారు కాదని, ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను మాత్రమే నిర్వర్తిస్తారని అధికారులు చెబుతున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అన్ని రాజకీయ పార్టీలకు చెందిన బీఎల్ఏలు భాగస్వాములే అయినప్పటికీ, కొందరు మాత్రం అధికారులు తమకు అనుకూలంగా వ్యవహరించాలని ఒత్తిడి తెస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ముందుగా తమ డివిజన్‌లలో తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం వంటి ప్రజా సమస్యలను పరిష్కరించి అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులతో ఘర్షణలకు ప్రాధాన్యం ఇస్తున్నారని స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కార్పొరేషన్ నుంచి నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేపట్టాల్సిన సమయంలో అధికారులతో వివాదాలు సృష్టించడం ప్రజలకు ఎలాంటి ప్రయోజనం చేకూరుస్తుందనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. మరోవైపు, కొందరు రెవెన్యూ అధికారులు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన చర్యలు తీసుకోలేదనే అసంతృప్తి ఉద్యోగ వర్గాల్లో వ్యక్తమవుతున్నట్లు సమాచారం. దీంతో ప్రభుత్వ ఉద్యోగుల్లో భద్రతా భావం తగ్గుతోందని, విధులు నిర్వర్తించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ అధికారుల విధుల్లో అనవసర జోక్యం, బెదిరింపులు, రాజకీయ ఒత్తిళ్లు కొనసాగితే పరిపాలనపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి వాస్తవాలను వెలికితీసి, అధికారులు స్వేచ్ఛగా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఉద్యోగ వర్గాలు కోరుతున్నాయి.

# కొత్తగూడెంలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కార్యక్రమం

### ఎస్పీ రోహిత్ రాజు, డీఎస్పీ ఆధినారాయణను మర్యాదపూర్వకంగా కలిసి ఆగస్టు 4 అవగాహన సదస్సుకు ఆహ్వానం




**కొత్తగూడెం, జూలై 21:(వార్త సంధ్య) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం ప్రాంగణంలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ చట్టాలు, మానవ హక్కులు, వినియోగదారుల హక్కులు, మహిళల హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బొడ్డుపాటి దాసు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కాల్వ సుధాకర్ రావు, సబ్-రిజిస్ట్రార్ అప్పారావు, జిల్లా అధ్యక్షుడు మాలోత్ రాందాస్ నాయక్ ప్రసంగించి చట్టాలపై అవగాహన ప్రతి పౌరుడికి అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సలహా బోర్డు అధ్యక్షుడు ఎస్.కె. అబ్బాస్, జిల్లా సభ్యురాలు విజయలక్ష్మి, జిల్లా ఇన్‌చార్జ్ గడ్డం శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ప్రతినిధులు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్, డీఎస్పీ ఆధినారాయణను మర్యాదపూర్వకంగా కలిసి ఆగస్టు 4న నిర్వహించనున్న చట్టాలపై అవగాహన సదస్సుకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ చేపడుతున్న సేవలను, బృందం చేస్తున్న కృషిని ఎస్పీ రోహిత్ రాజు, డీఎస్పీ ఆధినారాయణ అభినందించినట్లు నిర్వాహకులు తెలిపారు.

# ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** కేపీహెచ్‌బీ డివిజన్ పరిధిలోని ఫోర్త్ ఫేస్ వెంచర్-2 లో ఏఐసీసీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బండి రమేష్ సూచన మేరకు మైనార్టీ లీడర్ మద్దూం ఆధ్వర్యంలో ఈ వేడుకలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ వేడుకల్లో కేపీహెచ్‌బీ డివిజన్ ప్రెసిడెంట్ అరవింద్ రెడ్డి, బాలాజీ నగర్ ప్రెసిడెంట్ వి.ఆర్.ఎస్. గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గంధం రాజు, మేకల మైఖేల్, బాబ్జి, బి బ్లాక్ అధ్యక్షురాలు సంధ్య, జయలక్ష్మి, విజయలక్ష్మి, ఆదిలక్ష్మి, అపర్ణ, సుందరి, సాయి, వంశీ, రవి, సూర్యనారాయణ, శివాజీ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఖర్గే జన్మదిన వేడుకలను విజయవంతం చేశారు.

# వేపలగడ్డలో ప్రజలకు చీకట్లే దిక్కు.. మున్సిపల్ కార్పొరేషన్ నిర్లక్ష్యంపై ఆగ్రహం!

### రోజుల తరబడి వీధి దీపాలు వెలగక ప్రజల ఇబ్బందులు

### ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు, దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు

### రోడ్డుపై నిల్వ నీటితో దోమల బెడద.. కార్పొరేటర్ స్పందించాలని స్థానికుల డిమాండ్









**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 21(వార్త సంధ్య): వేపలగడ్డ:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వేపలగడ్డ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీధి దీపాలు పనిచేయకపోవడంతో రాత్రి వేళల్లో కాలనీలు అంధ కారంలో మునిగి పోతున్నాయి. దీంతో మహిళలు, వృద్ధులు, విద్యా ర్థులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే సమ యంలో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలపై ప్రమాదకరంగా వేలాడుతున్న తీగలు, దెబ్బతిన్న విద్యుత్ పరికరాలు స్థానికుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. మరోవైపు రోడ్డుపై నిల్వ నీరు పేరుకు పోవడంతో దోమల బెడద పెరిగి అంటువ్యాధుల భయం నెలకొంది. పలుమార్లు సంబంధిత అధికారులకు, స్థానిక కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంటనే వీధి దీపాల మరమ్మతులు, ప్రమాదకర విద్యుత్ తీగల తొలగింపు, నిల్వ నీటి తొలగింపు, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఆగస్టు 30లోగా తనిఖీలు పూర్తి కావాలి : బీసీ గురుకులాలపై మంత్రి పొన్నం ఆదేశాలు



తెలంగాణ రాష్ట్రంలోని బీసీ గురుకుల విద్యాసంస్థల నిర్వహణ, విద్యార్థుల వసతులపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కఠిన నిబంధనలు విధించారు. బీసీ గురుకుల రీజనల్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్లతో (ఆర్‌సీవో) కీలకమైన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన... రాబోయే ఆగస్టు 30వ తేదీ నాటికి రాష్ట్రంలోని అన్ని బీసీ గురుకుల విద్యాసంస్థల్లో క్షేత్రస్థాయి తనిఖీలను పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన గడువు విధించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పూర్తి సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడమే ప్రభుత్వ ప్రాధాన్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ విధివిధానాల్లో భాగంగా ప్రతి ఆర్‌సీవో కచ్చితంగా వారానికి మూడు రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించి, కనీసం ఆరు గురుకుల విద్యాసంస్థలను నేరుగా సందర్శించాలని మంత్రి ఆదేశించారు. విధుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించిన ఆయన, స్వయంగా తాను కూడా ప్రతి నెలా కనీసం 15 గురుకులాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని వెల్లడించారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా ఎక్కడా ఫుడ్ పాయిజనింగ్ వంటి ఘటనలు జరగకుండా ఆహార నాణ్యతపై ప్రత్యేక నిఘా పెట్టాలని అధికారులకు సూచించారు. చదువుతో పాటు క్రీడలు, కళలు, వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యమిస్తూ, ఒత్తిడి తగ్గించేందుకు సైకాలజిస్టులతో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు. మరొక వైపు సొంత భవనాలు లేని గురుకులాలకు భూముల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మూసీ గురుకులానికి సొంత భవన నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకులాలకు కేటాయించే నిధుల్లో ఆరు శాతాన్ని అత్యవసర మరమ్మతులకు వినియోగించుకునేలా అనుమతించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి గురుకులంలో రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని, విద్యార్థుల భాగస్వామ్యంతో విస్తృతంగా మొక్కలు నాటించి వాటిని సంరక్షించే బాధ్యతలను కూడా వారికి అప్పగించాలని ఆర్‌సీవోలకు మంత్రి పొన్నం ప్రభాకర్ దిశానిర్దేశం చేశారు.

# నేటి నుంచి క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులు

### మీ సేవ, మీ సేవ వాట్సాప్‌లో "ఇందిరమ్మ ఇండ్లు" దరఖాస్తు సౌకర్యం

**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) జూలై 21.** :తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు పథకానికి సంబంధించిన దరఖాస్తు సేవలను మీ సేవ, మీ సేవ వాట్సాప్ ద్వారా అధికారికంగా ప్రారంభించింది. ప్రజాప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, సులభంగా అర్హులైన వారందరూ చేసుకునేలా ఏర్పాట్లు చేసింది. క్యూర్ పరిధిలో అర్హులైన పౌరులు ఈ సేవల ద్వారా తమ సమీపంలోని మీ సేవ కేంద్రం లేదా మీ సేవ వాట్సాప్ (8096958096) ద్వారా సులభంగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందిరమ్మ ఇండ్లు పథకానికి దరఖాస్తుల స్వీకరణ నేటి నుంచి మొదలౌతుంది. 21 జూలై 2026 నుండి ప్రారంభమై 10 ఆగస్టు 2026 వరకు కొనసాగుతుంది. అర్హులైన పౌరులు ఈ గడువులోగా తమ దరఖాస్తులను సమర్పించాలని ప్రభుత్వం కోరుతోంది. మీ సేవ పోర్టల్ లేదా మీ సేవ వాట్సాప్ ద్వారా పౌరులు ఇందిరమ్మ ఇండ్లు పథకానికి దరఖాస్తు చేసుకోవడం, తమ అప్లికేషన్ స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.

**దరఖాస్తు చేసే విధానం**



1. మీ సేవ కేంద్రం ద్వారా: సమీపంలోని మీ సేవ కేంద్రాన్ని సందర్శించి ఇందిరమ్మ ఇండ్లు సేవ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

2. మీ సేవ వాట్సాప్ ద్వారా:

8096958096 నంబర్‌కు "లేదా సందేశం పంపి, చాట్‌బాట్ సూచనలను అనుసరిస్తూ నేరుగా మొబైల్ ఫోన్ ద్వారానే దరఖాస్తు చేసుకోవచ్చు. లబ్ధిదారులు తమ ఆధార్ కార్డు వివరాలు సమర్పించాల్సి ఉంటుంది. మీ సేవ లేదా మీ సేవ వాట్సాప్ ద్వారా ఇందిరమ్మ ఇండ్లు సేవలను అందుబాటులోకి తీసుకురావడం వల్ల అర్హులైన లబ్ధిదారులకు దరఖాస్తు ప్రక్రియ మరింత సులభతరం కానుంది. దీంతో ప్రభుత్వ కార్యాలయాలకు పలుమార్లు వెళ్లాల్సిన అవసరం తగ్గడంతో పాటు, పేపర్‌వర్క్ తగ్గి, దరఖాస్తు స్థితిని పారదర్శకంగా ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం కలుగుతుంది. ప్రజలకు ప్రభుత్వ సేవలను డిజిటల్, మొబైల్ వేదికల ద్వారా మరింత చేరువ చేయాలనే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యంలో భాగంగానే ఈ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు మీసేవ ఉన్నతాధికారులు తెలిపారు. అర్హులైన పౌరులు నేటి నుంచి (21 జూలై 2026 నుండి 10 ఆగస్టు 2026 మధ్యలో) తమ దరఖాస్తులను తప్పనిసరిగా సమర్పించాలని, దరఖాస్తు చేసే ముందు అవసరమైన పత్రాల స్కాన్ కాపీలు లేదా స్పష్టమైన ఫోటోలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయండి

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి, ఐఎఎస్

**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)జూలై 21:** రాష్ట్రంలో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియకు సంబంధించిన అన్ని కార్యక్రమాలను సకాలంలో పూర్తయ్యేలా సంబంధిత ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి ఐఎఎస్ ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారమ్ లను ఆన్ లైన్ లో సమర్పించిట్లయితే హార్డ్ కాపీ కోసం బిఎల్ఓలు ఓటర్లను ఇబ్బంది పెట్టొద్దని సూచించారు. ఎన్యుమరేసన్ ఫారమ్ సమర్పించేటప్పుడు ఆధార్ కార్డు తప్పనిసరి అని చెప్పొద్దని, ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారమ్ లను సమర్పించేందుకు అవసరమైన సహాయాన్ని అందించి, వారి ఫిర్యాదులను పరిష్కరించాలని తెలిపారు. అలాగే ఓటరు జాబితాల్లో వీవీఐపి, వీఐపి ఓటర్ల పేర్లు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. గైర్హాజరు, నివాసం మారిన, మరణించిన ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం







చేయాలని సూచించారు. రాజకీయపార్టీలతో నిర్వహించే సమావేశాల్లో పారదర్శకత పాటిస్తూ, సంబంధిత వివరాలను నమోదు చేయాలని, పట్టణ ప్రాంతాలు, పురోగతి తక్కువ ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ వారంలోగా ప్రతి జిల్లాలో ఎన్యుమరేషన్ ప్రక్రియ 90శాతం పూర్తయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆయన ఆదేశించారు. అలాగే నో మ్యాపింగ్ కేటగిరీలో ఉన్న ఓటర్లను పూర్తిస్థాయిలో ధృవీకరించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్-2026 కార్యక్రమాన్ని సకాలంలో పూర్తి చేయడానికి సంబంధిత ఎన్నికల అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డాక్టర్. వాసం వెంకటేశ్వర్ రెడ్డి ఐఎఎస్, ఉప ప్రధాన ఎన్నికల అధికారి జి.ఎస్. చారిలు, తదితరుల పాల్గొన్నారు.

# నెలవారీ బడ్జెట్ ప్రిపేర్ చేస్తున్నారా - ఇలా పాటిస్తేనే సక్సెస్ అవుతుందట!

### - జీతం, ఖర్చులకు సరిపడేలా బడ్జెట్ ప్రిపేర్ చేస్తున్నారా - అది పక్కాగా అమలు కావాలంటే ఈ విషయాలు తెలుసుకోవాలి!

జీవితంలో ఎన్నో విజయాలకు "ఆర్థిక క్రమశిక్షణ" పునాది. ఆదాయం ఎంత వస్తోందన్నదానికంటే.. దానిని ఏ విధంగా ఖర్చు చేస్తున్నామన్నదే మన భవిష్యత్తును నిర్ణయిస్తుంది. అందుకే చాలా మంది తమ జీతం, ఖర్చులకు అనుగుణంగా బడ్జెట్ తయారు చేస్తుంటారు. అయితే, చాలా మంది ప్లాన్ కరెక్ట్‌గానే ఉంటుంది, కానీ ఎగ్జిక్యూషన్‌లో మాత్రం ఫెయిల్ అవుతుంటారు. దీనికి కారణాలేంటో నిపుణులు వివరిస్తున్నారు. బడ్జెట్ వేసుకోవడం అంటే అనవసర ఖర్చులకు అడ్డుకట్ట వేస్తూ, ఫ్యూచర్ కోసం డబ్బును పొదుపు చేసుకోవడమని చెబుతున్నారు. బడ్జెట్ ప్రణాళికను సరిగ్గా అమలు చేస్తున్నవారు ఎంతో ఆత్మవిశ్వాసంతో ఉన్నట్టు ఒక సర్వేలో తేలిందట. ఈ క్రమంలోనే బడ్జెట్‌ను విజయవంతంగా అమలు చేయడానికి కొన్ని టిప్స్ ఉన్నట్లు చెబుతున్నారు నిపుణులు. అవేంటో ఇప్పుడు చూద్దాం.ఆచరణాత్మకంగా: బడ్జెట్ సక్సెస్ కావాలంటే అది కాగితం మీద మాత్రమే కాకుండా, ఆచరణలో అమలు చేయానికి వీలుగా ఉండటం ముఖ్యం అంటున్నారు నిపుణులు. అంటే అంచనాలు ఎప్పుడూ ప్రస్తుత పరిస్థితులకు దగ్గరగా ఉండాలని సూచిస్తున్నారు. ఉదాహరణకు నలుగురు సభ్యులున్న ఒక కుటుంబానికి నెలకు నిత్యావసర ఖర్చులు రూ.15,000 అవుతుంటే.. దాన్ని ఒక్కసారిగా రూ.5,000కు తగ్గించుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంటే, అది సాధ్యం కాదంటున్నారు.అదే ఖర్చును రూ.13వేలకు తగ్గించాలని ప్రయత్నిస్తే, కచ్చితంగా సాధ్యం అవుతుందంటున్నారు. పొదుపు విషయంలోనూ ఇదే పద్ధతి పనికొస్తుందని వివరిస్తున్నారు. ఇల్లు కొనడానికి డౌన్ పేమెంట్, కొత్త కారు కొనుగోలు, విదేశీ ప్రయాణం వంటి అన్ని లక్ష్యాలూ ఒకేసారి సాధించాలనుకోవడం అత్యాశే అవుతుందని.. ఆదాయానికి తగ్గట్టుగా ఏది ముందు, ఏది తరువాత అనే ప్రాధాన్యాలను నిర్ణయించుకొని అడుగులు వేయాలని సూచిస్తున్నారు.బాధ్యతను అప్పగించండి: సంపాదనలో ప్రతి రూపాయికీ ఒక బాధ్యతను అప్పగించాలంటున్నారు. అంటే నెల జీతం రాగానే అద్దె, బిల్లులు, పొదుపు, మదుపు ఇలా అన్నింటికీ పూర్తిగా లెక్కలు రాసి, ఆ ప్రకారమే కేటాయించాలంటున్నారు. నెలాఖరుకు మీ చేతిలో నికర మొత్తం సున్నా అయ్యేలా ముందే ప్రణాళిక వేసుకోవాలని సూచిస్తున్నారు. దీని కోసం ప్రతి ఖర్చునూ నిశితంగా గమనించాలని, జీతం రాగానే ముందుగా దీర్ఘకాలిక లక్ష్యాల కోసం కొంత మొత్తాన్ని పొదుపు ఖాతాలోకి మళ్లించాలంటున్నారు.నేరుగా చెల్లించేయండి: అనుకోని కారణాల వల్ల కొన్నిసార్లు బిల్లులను సకాలంలో చెల్లించలేకపోతాం. దీనివల్ల పెనాల్టీ కట్టడంతోపాటు క్రెడిట్ స్కోరూ



దెబ్బతింటుంది. అయితే, ఈ సమస్యకు ఉత్తమ పరిష్కారం.. బిల్లుల చెల్లింపులను, పొదుపును ఆటో-పే లేదా ఆటోమేటిక్ ట్రాన్స్‌ఫర్ విధానంలో ఉంచడం అని సూచిస్తున్నారు. అంటే నెల ప్రారంభంలోనే నిర్దేశిత సొమ్ము పొదుపు ఖాతాలోకి ట్రాన్స్‌ఫర్ అయ్యేలా ఏర్పాటు చేసుకుంటే, ఆ డబ్బును ఇతర వృథా ఖర్చులకు ఉపయోగించే అవకాశం ఉండదని సూచిస్తున్నారు.ముందే ఊహించండి: నార్మల్‌గా నెలవారీ ఖర్చులు మనకు గుర్తుంటాయి. కానీ, సంవత్సరానికి ఒకసారి చెల్లించే బీమా ప్రీమియంలు, పన్నులు, పండగలు లేదా పుట్టిన రోజు గిఫ్ట్‌లు, ఓటీటీ యాన్యువల్ చందాలవంటి వ్యయాలు చాలా మంది బడ్జెట్‌లో చేర్చడం మర్చిపోతుంటారు. దీంతో ఇవి హఠాత్తుగా వచ్చి పడినప్పుడు నెలవారీ బడ్జెట్ తలకిందులవుతుందని. అందుకే, ఇటువంటి ఖర్చులనూ ముందుగానే ఊహించి, బడ్జెట్‌లో వీటిని తగిన ప్రాధాన్యం కల్పించాలంటున్నారు.అనాలోచితంగా వద్దు: చాలా మంది షాపింగ్ మాల్‌కు వెళ్లినప్పుడో లేదా ఆన్‌లైన్ సైట్లను చూస్తున్నప్పుడో అవసరం లేకపోయినా కేవలం ఆకర్షణీయమైన ఆఫర్లను చూసి, క్షణికావేశంలో వస్తువులను కొనేస్తుంటారు. ఇలాంటి అనాలోచిత ఖర్చులు బడ్జెట్‌ను దెబ్బతీయడమే కాకుండా, తీవ్ర ఆర్థిక ఒత్తిడికి గురిచేస్తాయని హెచ్చరిస్తున్నారు నిపుణులు. ఒక సర్వేలో అనాలోచిత ఖర్చులు చేసే వారిలో 52 శాతం మంది దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలను వాయిదా వేసుకోవాల్సి వస్తోందని, 47 శాతం మంది తీవ్ర ఒత్తిడిని ఎదుర్కుంటున్నామని చెప్పారట.దీన్ని అధిగమించేందుకు "వేచి ఉండే నియమం" పాటించాలంటున్నారు. ఏదైనా వస్తువు కొనాలి అనిపించినప్పుడు కనీసం రెండుమూడు రోజులైనా వెయిట్ చేయాలని, అప్పటికి దాని అవసరం ఎంత ఉందనేది తెలుస్తుందని చెబుతున్నారు. అనుకోని కొనుగోళ్ల కోసం బడ్జెట్‌లో చాలా చిన్న మొత్తం కేటాయించడం మంచిదని వివరిస్తున్నారు.సమీక్షించుకోండి: బడ్జెట్ విషయంలో కేవలం కాగితంపై ప్రణాళికలు రాసుకుంటే సరిపోదని, వాటిని కచ్చితంగా అమలు చేస్తున్నామా లేదా అనేది పర్యవేక్షించుకోవాలంటున్నారు. జీవిత భాగస్వామితో కలిసి బడ్జెట్ విషయాలను చర్చించడం అలవాటు చేసుకోవాని సూచిస్తున్నారు. ఒంటరిగా ఉండేవారు నమ్మకమున్న బంధువులు, కుటుంబ సభ్యుడిని తమ ఆర్థిక పెట్టుబడులకు నామినీగా ఉంచాలని వివరిస్తున్నారు.మార్చుకునేలా ఉండాలి: బడ్జెట్ అనేది శిలా శాసనం కాదని, కాలక్రమేణా మారుతున్న అవసరాలకు అనుగుణంగా దీన్ని సవరించుకుంటూ ఉండాలని వివరిస్తున్నారు. నెలాఖరున బడ్జెట్ అంచనాలను, అసలు ఖర్చులతో పోల్చి చూసుకోవాలని, అనుకున్నదానికంటే ఎక్కువ ఖర్చు అవుతుంటే వచ్చే నెలలో తగిన మార్పులు చేసుకోమంటున్నారు. ఉద్యోగం మారడం, కుటుంబంలో కొత్త సభ్యుల రాక, అనారోగ్యం వంటి పెద్ద జీవిత మార్పులు సంభవించినప్పుడు బడ్జెట్‌ను పూర్తిగా మార్చుకోవడానికి వెనుకాడకూదని సలహా ఇస్తున్నారు.

# త్వరలో పాలిమర్ నోట్లు విడుదల- 2027 నుంచి పూర్తిస్థాయిలో ప్రారంభించే అవకాశం!

తొలుత రూ.10, రూ.20 నోట్లు- కొత్త పాలిమర్ నోట్లనూ దశలవారీగా ప్రవేశపెట్టనున్న త్వరలో పాలిమర్ నోట్లను విడుదల చేయనున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అధికారిక వర్గాలు తెలిపాయి. కొత్త తరం కరెన్సీని ప్రవేశపెట్టాలన్న కేంద్ర బ్యాంకు ప్రణాళికలో తదుపరి దశగా ఈ చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నాయి. వీటిని ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా రూ.10, రూ.20 నోట్లను తొలుత తీసుకురానున్నారు. వీటి ఫలితం ఆధారంగా, 2027 నుంచి పూర్తిస్థాయిలో అమలు చేసే దిశగా ఆర్‌బీఐ అడుగులు వేస్తోంది. ప్రస్తుత కాగితపు నోట్లు చలామణిలో కొనసాగుతుండగానే కొత్త పాలిమర్ నోట్లనూ దశలవారీగా ప్రవేశపెట్టనున్నారు. పాలిమర్ నోట్లు వచ్చినప్పటికీ, పేపర్ కరెన్సీ ఎప్పటిలానే కొనసాగుతాయని, దశలవారీగా పాలిమర్ నోట్లు మార్కెట్‌లోకి చలామణికి రానున్నాయని వర్గాలు తెలిపాయి. అయితే, కాగితపు కరెన్సీతో పోలిస్తే ఇవి ఎక్కువ మన్నికగా ఉంటాయి. చలామణిలో ఉన్న కరెన్సీ నాణ్యతను, మన్నికను మెరుగుపరిచే విస్తృత వ్యూహంలో భాగంగా పాలిమర్ నోట్లను ప్రవేశపెట్టాలనే తన ఉద్దేశాన్ని ఆర్‌బీఐ గతంలోనే ప్రకటించింది.

**ఈ నోట్లతో ఎక్కువ కాలం మన్నిక**

కరెన్సీ నోట్ల మన్నికను పెంచడం, అలాగే, నకిలీ నోట్లను అరికట్టడం ఈ పాలిమర్ నోట్ల ముఖ్య ఉద్దేశం. అయితే, అధునాతన భద్రతా లక్షణాలతో కూడిన పాలిమర్ సబ్‌స్ట్రేట్‌ను సరఫరా చేయడానికి ప్రపంచవ్యాప్త తయారీదారులను ఆహ్వానించారు. బిడ్లను సమర్పించడానికి చివరి తేదీ ఆగస్టు 18. ఇక, పాలిమర్ నోట్ల విషయానికొస్తే, ఇవి తడిని తట్టుకోగలవు, అలాగే, చిరిగి పోవడం,




నల్లగా మారడం వంటి సమస్యలు ఉండవు. అంతేకాదు, ఈ నోట్లు ఎక్కువ కాలం మన్నడమే కాకుండా నీరు, మురికి వంటి వాటికి త్వరగా పాడవవు. పలుచని, రక్షిత అల్ట్రా వయొలెట్ క్యూర్డ్ వార్నిష్ పూత పూసిన కాగితపు నోట్లనే వార్నిష్ కరెన్సీగా పిలుస్తారు. తరచూ నోట్లు పాడైపోయి, కొత్తవి ముద్రించేందుకు అవుతున్న ఖర్చు తగ్గించేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. ఇప్పటికే, ఆస్ట్రేలియా, కెనడా, యూకే, న్యూజిలాండ్ వంటి దేశాల్లో పాలిమర్ నోట్లను విస్తృతంగా వినియోగిస్తున్నారు.

**డిజిటల్ చెల్లింపులు వచ్చినప్పటికీ**

డిజిటల్ చెల్లింపులు వచ్చినప్పటికీ, కాగితపు కరెన్సీకి ఉన్న గిరాకీ ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ నేపథ్యంలో ప్లాస్టిక్ కరెన్సీ నోట్లను ముద్రించాలన్న ఆలోచనను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పదేళ్ల క్రితమే ప్రతిపాదించింది. కాగితపు కరెన్సీని ముద్రించడానికి అయ్యే ఖర్చు, నోట్లు చేతులు మారే క్రమంలో అవి పాడైపోవడం వంటి వాటిని దృష్టిలోఉంచుకొని గతంలో ఆర్‌బీఐ ఆ ప్రతిపాదన చేసింది. కాటన్‌తో తయారు చేసే కాగితపు నోట్లకు బదులు, ప్లాస్టిక్ ఆధారిత పాలిమర్ నోట్లను తీసుకురావడం ద్వారా ఖర్చును తగ్గించుకోవచ్చని ఆర్బీఐ భావిస్తోంది.అయితే, దేశవ్యాప్తంగా ట్రయల్ పద్ధతిలో రూ.10 విలువైన ఒక బిలియన్ ప్లాస్టిక్ నోట్లను ప్రవేశపెట్టనున్నట్లు ఆ సమయంలో పార్లమెంట్‌కు కేంద్రం తెలియజేసింది. అందుకు కొచ్చి, మైసూర్, జైపూర్, శిమ్లా నగరాలను ఎంచుకుంది. అయితే సాంకేతిక, కార్యాచరణ సమస్యల కారణంగా ఆ ఆలోచన కార్యరూపం దాల్చలేకపోయింది. ఇప్పుడు మళ్లీ ఈ అంశంపై దృష్టి సారించిన కేంద్ర బ్యాంక్, ఏటీఎంలలో వీటి అనుకూలత వంటి సాంకేతిక అంశాలను పరిశీలిస్తూ పైలట్ ప్రాజెక్టుకు సిద్ధమవుతోంది. అయితే, దీనిపై ఆర్బీఐ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.ఇక, నకిలీ నోట్ల విషయానికొస్తే, బ్యాంకింగ్ వ్యవస్థలో నకిలీ రూ.500 నోట్లు కూడా పెద్ద సంఖ్యలో చలామణిలో ఉన్నట్లు ఆర్‌బీఐ కొద్దిరోజుల క్రితం గుర్తించింది. అంతేకాదు, గతేడాదితో పోలిస్తే ఈ నకిలీల బెడద 20 శాతం పెరిగినట్లు పేర్కొంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 1,17,722 రూ.500 నోట్లను గుర్తించగా, 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆ సంఖ్య 1,41,907 నోట్లకు పెరిగినట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో దాదాపు 30,591 నకిలీ రూ.200 నోట్లను గుర్తించినట్లు ఆర్‌బీఐ పేర్కొంది.

# ఇంత అహంకారపూరిత ధోరణి ఎందుకు

**హైడ్రా కమిషనర్ పై హైకోర్టు అసంతృప్తి**

**ఇక్కడ బాధిత జాబితాలో కోర్టు ఉంది**

**హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై హైకోర్టు అసంతృప్తి**

**కోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా ప్రైవేట్ వ్యక్తుల భూముల్లోకి ఎందుకు వెళుతున్నారు**

**బహదూర్‌గూడ భూములపై చర్యలొద్దు**




ప్రైవేట్ ఆస్తిలో జోక్యం చేసుకోరాదంటూ న్యాయస్థానం ఉత్తర్వులున్నా, పదే పదే కోర్టు ధిక్కరణకు పాల్పడుతున్న హైడ్రా తీరుపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. నీటి వనరులు, నాలాలు, కాలువల రక్షణకు చేపడుతున్న చర్యలు అభినందనీయమే కానీ, ఇలా కోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా ప్రైవేట్ వ్యక్తుల భూముల్లోకి దూసుకువెళ్లడం సరికాదని వ్యాఖ్యానించింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరి మండలం లోతుకుంట గ్రామం సర్వే నంబర్? 1, 2లోని 40 ఎకరాల భూమిలో ఈ నెల 17న హైడ్రా కూల్చివేతలు చేపట్టడాన్ని సవాల్ చేస్తూ శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీ అత్యవసరంగా సోమవారం మరో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్ పై జస్టిస్ జూకంటి అనిల్ కుమార్ విచారణ చేపట్టారు.పిటిషనర్ తరఫు న్యాయవాది ఎం.హరీశ్ కుమార్ వాదనలు వినిపిస్తూ ఈ నెల 17న హైడ్రా అధికారులు ప్రహరీ గోడను కూల్చి, అక్కడున్న నిర్మాణాలను పూర్తిగా ధ్వంసం చేశారన్నారు. ఇప్పటికే రెండు కోర్టు ధిక్కరణ పిటిషన్‌లలో ఉత్తర్వులకు విరుద్ధంగా వ్యవహరించారని పేర్కొన్నారు. కోర్టు ఉత్తర్వులున్నాయని చెప్పినా పిటిషనర్‌పై చేయి చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసి సాయంత్రం వరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. వాదనలను విన్న న్యాయమూర్తి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకానొక దశలో కమిషనర్‌ను కోర్టు ముందు హాజరు పరచాలంటూ పోలీసులకు ఆదేశాలు ఇస్తామన్నారు. చివరికి సాయంత్రం 6.30 గంటలకు హాజరవుతానని హైడ్రా కమిషనర్ చెప్పడంతో విచారణను సాయంత్రానికి వాయిదా వేశారు."ఒకే అంశానికి సంబంధించి 3 కోర్టు ధిక్కరణ పిటిషన్‌లు దాఖలవుతున్నాయంటే కోర్టు ఉత్తర్వులంటే మీకు ఏ మాత్రం గౌరవముందో అర్థమవుతోంది. ఇంత అహంకారపూరిత ధోరణి ఏ మాత్రం సరికాదు. ఇక్కడ బాధితులు పిటిషనర్ కాదు కోర్టే. మీకు కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన పరిపాటిగా మారింది. ఈ ప్రవర్తనను ఎట్టి పరిస్థితుల్లో సహించబోం. ప్రభుత్వం, అధికారులు ఎవరైనా చట్టానికి లోబడే పనిచేయాల్సి ఉంటుంది" హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను ఉద్దేశించి హైకోర్టు వ్యాఖ్యలుఇది న్యాయ ప్రక్రియలో జోక్యమే : హైడ్రా తరఫున తెలంగాణ అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ జీఎల్ఆర్ సర్వే నంబర్ 243లో 119 ఎకరాలు ప్రభుత్వ భూమి అని, దాని పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దీనిపై సర్వే, విభజన చేయడానికి కొంత గడువు ఇవ్వాలని కోరగా, న్యాయమూర్తి స్పందిస్తూ గతంలో కలెక్టర్ ఇదే హామీ ఇచ్చారని, ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని న్యాయమూర్తి ప్రశ్నించారు. కోర్టు ముందు హాజరైన రంగనాథ్‌ను ఉద్దేశించి ఇలా అన్నారు.'కోర్టు ఉత్తర్వులపై అభ్యంతరాలుంటే ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. ఉత్తర్వులు అమల్లో ఉన్నంత వరకు వాటికి కచ్చితంగా కట్టుబడి ఉండాల్సిందే. ప్రభుత్వ భూమి రక్షణ కోసమని ప్రైవేట్ భూమిలోకి ఎలా వెళతారు ఇప్పుడు అది రక్షణ శాఖ భూమి అని చెబుతున్నపుడు దాన్ని ఎందుకు ప్రతివాదిగా చేర్చలేదు పైగా దానిపై డివిజన్ బెంచ్ ఉత్తర్వులు ఉండగా, చర్యలు తీసుకోవడం న్యాయ ప్రక్రియలో జోక్యం చేసుకోవడమే అవుతుంది. ఇలాంటి చర్యలను అనుమతించేది లేదు' అని వ్యాఖ్యానించారు.అఫిడవిట్ దాఖలు చేయండి ఇది ప్రభుత్వం తరఫున అనుచితమని ఏజీ సుదర్శన్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు. పిటిషనర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసి సంబంధిత కాపీ ఇవ్వకపోవడాన్ని తప్పుబట్టారు. తక్షణం ఎఫ్ఐఆర్ కాపీ ఇవ్వాలంటూ హోంశాఖ న్యాయవాది మహేశ్‌రాజేను ఆదేశించారు. దీనికి సంబంధించి అఫిడవిట్ దాఖలు చేయాలని, విచారణను మంగళవారానికి వాయిదా వేశారు.విచారణ సమయంలో జడ్జి ఆదేశాలతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ హాజరు, పోలీసులు రావడంతో కోర్టు ఆవరణలో హడావుడి వాతావరణం చోటుచేసుకుంది. అడ్వొకేట్ జనరల్‌తోపాటు అదనపు అడ్వొకేట్ జనరల్ మహమ్మద్ ఇమ్రాన్‌ఖాన్, ప్రత్యేక న్యాయవాదులు, న్యాయవాదులు, హైడ్రా స్టాండింగ్ కౌన్సిల్ సమీర్ అహ్మద్ తదితరులు విచారణలో భాగంగా పాల్గొన్నారు.బహదూర్‌గూడ భూములపై చర్యలొద్దు రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహదూర్‌గూడ సర్వే నంబర్ 3, 5లోని 28.6 ఎకరాల భూమికి సంబంధించి ఎలాంటి తదుపరి చర్యలు తీసుకోరాదంటూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈ భూముల్లో జోక్యంపై పూర్తి వివరాలతో కౌంటరు దాఖలు చేయాలని వారం రోజులకు వాయిదా వేసింది. తమ భూమిలోకి హైడ్రాతోపాటు అధికారులు వచ్చి ఫెన్సింగ్ వేశారంటూ రంగారెడ్డి జిల్లా గుర్రంగూడకు చెందిన రైతు జె.యాదిరెడ్డి మరో ముగ్గురు హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం విచారణ చేపట్టారు.పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది వి.రఘునాథ్ వాదనలు వినిపిస్తూ తమ వ్యవసాయ భూమిని సాగు చేస్తున్నందుకు గేట్లను కూల్చివేసి బలవంతంగా ఫెన్సింగ్ ఏర్పాటు చేశారన్నారు. అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ తెలంగాణలో బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం సేకరిస్తున్న 650 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఇది భాగమని తెలిపారు. దీనికి సంబంధించి వారికి ఉన్న హక్కులకు ఎటువంటి ఆధారాలు చూపలేదని తెలిపారు. వాదనలు విన్న న్యాయమూర్తి ఈ అంశంపై కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ వచ్చే వారానికి వాయిదా వేశారు. అప్పటివరకు బహదూర్‌గూడ భూములపై ఎలాంటి చర్యలు తీసుకోరాదంటూ హైడ్రాను ఆదేశించారు.

# నీట్ కౌన్సెలింగ్‌కు సర్వం సిద్ధం

**ఏపీ వైద్య కళాశాలల్లో కొత్తగా 17 అలైడ్ హెల్త్ కోర్సులు**

**త్వరలో నీట్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ప్రకటించనున్న ఎంసీసీ**

**2026-27 విద్యా సంవత్సరానికి అదనంగా 9,911 మెడికల్ సీట్ల పెంపు**

**ఆలిండియా కోటా కింద 15శాతం సీట్ల భర్తీకి కేంద్ర కమిటీ కసరత్తు**




దేశవ్యాప్తంగా వైద్య విద్యా ప్రవేశాలకు సంబంధించి కీలక ఘట్టం మొదలుకాబోతోంది. జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) ఫలితాలు ఇప్పటికే వెలువడ్డాయి. ఇక విద్యార్థులు, తల్లిదండ్రుల దృష్టి కౌన్సెలింగ్ పైనే పడింది. ప్రవేశాల ప్రక్రియను పూర్తి చేసేందుకు మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) ముమ్మర కసరత్తు చేస్తోంది. మరోవైపు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ వైద్య విద్యలో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయి. ఈ విద్యా సంవత్సరం నుంచి ఏపీలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో కొత్తగా 17 అలైడ్ హెల్త్ కోర్సులను ప్రవేశపెట్టనున్నారు.త్వరలో కౌన్సెలింగ్ షెడ్యూల్ మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) నీట్ కౌన్సెలింగ్ ప్రక్రియను వేగవంతం చేసింది. త్వరలోనే అధికారిక కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేయనుంది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 15 శాతం ఆలిండియా కోటా సీట్లను ఎంసీసీ భర్తీ చేస్తుంది. అలాగే సెంట్రల్ యూనివర్సిటీలు, డీమ్డ్ వర్సిటీలు, ఎయిమ్స్, జిప్మర్ వంటి ప్రతిష్టాత్మక సంస్థల్లోని సీట్లను కూడా ఎంసీసీనే నేరుగా భర్తీ చేయనుంది. మిగిలిన 85 శాతం స్టేట్ కోటా సీట్లను మాత్రం ఆయా రాష్ట్రాల కౌన్సెలింగ్ కమిటీలు భర్తీ చేస్తాయి.భారీగా పెరిగిన వైద్య సీట్లు వైద్య విద్య అభ్యసించాలనుకునే విద్యార్థులకు ఈ ఏడాది శుభవార్త అందింది. జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) విడుదల చేసిన తాజా సీట్ మ్యాట్రిక్స్ ప్రకారం, 2026-27 విద్యా సంవత్సరానికి గానూ ఏకంగా 9,911 మెడికల్ సీట్లు అదనంగా పెరిగాయి. భారీగా సీట్లు పెరగడంతో విద్యార్థుల్లో ఆశలు చిగురించాయి. తమకు వచ్చిన నీట్ స్కోరు, కటాఫ్ మార్కుల ఆధారంగా తమకు ఏ కళాశాలలో సీటు వస్తుందోనని అభ్యర్థులు అంచనాలు వేసుకుంటున్నారు.ఏపీలో కొత్తగా 17 కోర్సులు ఈ విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో కొత్త కోర్సులు రాబోతున్నాయి. జాతీయ అలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్స్ కమిషన్ గుర్తింపు పొందిన మొత్తం 17 అలైడ్ హెల్త్ కోర్సులను ప్రవేశపెట్టేందుకు ఉన్నతాధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. విజయవాడలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయంలో ఇటీవల ఓ కీలక సమీక్షా సమావేశం జరిగింది. వర్సిటీ ఉపకులపతి (వీసీ) చంద్రశేఖర్ అధ్యక్షతన ఈ భేటీ నిర్వహించారు. అధ్యాపకుల లభ్యత, మౌలిక సదుపాయాలు, ఎన్సీఏహెచ్‌పీ నిబంధనల ప్రకారం 2026-27 నుంచి ఈ అలైడ్ కోర్సులను దశలవారీగా అమలు చేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలో అలైడ్ హెల్త్ విద్యను మరింత బలోపేతం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని వీసీ చంద్రశేఖర్ స్పష్టం చేశారు.జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన ఆరోగ్య సేవల నిపుణులను తీర్చిదిద్దేందుకు విశ్వవిద్యాలయం కట్టుబడి ఉందని వీసీ వివరించారు. ఈ కొత్త కోర్సులను దశలవారీగా ప్రారంభించడం వల్ల రాష్ట్రంలో అలైడ్ హెల్త్ విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా సామాన్యులకు అందే ఆరోగ్య సేవలు మరింత బలోపేతం అవుతాయని ఆయన వెల్లడించారు.

# ఏపీ ప్రభుత్వోద్యోగులకు బిగ్ అప్‌డేట

**సెప్టెంబర్ 1 నుంచి ఇ ఎస్ఆర్ 2.0 తప్పనిసరి**

**రాష్ట్రంలో 6 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ రికార్డులు ఆన్‌లైన్**

**సెప్టెంబర్ 1 నుంచి ఇ-ఎస్ఆర్ 2.0 తప్పనిసరి**

**ఫిజికల్ సర్వీస్ రిజిస్టర్ల స్థానంలో ఇ ఎస్ఆర్‌లు**

రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల సర్వీసు రికార్డుల నిర్వహణలో కొత్త అధ్యాయం మొదలు కానుంది. ఎలక్ట్రానిక్ సర్వీస్ రిజిస్టర్ నిర్వహణకు ఇ ఎస్ఆర్.2.0 అప్లికేషన్ అమల్లోకి వచ్చింది. ఫిజికల్ సర్వీసు రికార్డుల స్దానంలో ఇ-ఎస్ఆర్ ల నిర్వహణను సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఉత్తరువులు ఇచ్చింది. దాదాపు ఆరులక్షల వరకు ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు వారి సర్వీసు రిజిస్టర్ల నిర్వహణ ఎలక్ట్రానిక్ రూపంలోకి మార్పు ద్వారా బదిలీలు, రిటైర్మెంట్ సమయంలో ఎదురయ్యే ఇబ్బందులు ఎదురు కాకుండా ఇది తోడ్పడనుంది.అందుబాటులోకి ఇ-ఎస్ ఆర్. 2.0 అప్లికేషన్ : రాష్ట్రంలో వివిధ శాఖలలో ఉన్న ప్రభుత్వోద్యోగుల సర్వీసు రిజిస్టర్ నిర్వహణ వెతలకు చెక్ పెడుతూ ఇ-ఎంఆర్ విధానం ప్రభుత్వం అమలు తప్పనిసరి చేసింది. ఇప్పటికే అభివృద్ధి చేసిన ఇ-ఎంఆర్. 2.0 అప్లికేషన్ అందుబాటులోకి తీసుకువచ్చినట్టు ఆర్థిక శాఖ మానవ వనరుల విభాగం తాజా ఉత్తరువులలో వివరించింది. నేటి నుంచి రాష్ట్ర సచివాలయం, హెచ్ ఓడి కార్యాలయాల్లో సిబ్బంది ఇ-ఎంఆర్ లో ప్రాథమిక నమోదు ప్రక్రియ ఆరంభమవుతుందని, మిగిలిన అన్ని చోట్ల ఈ ప్రక్రియ ఆగస్టు ఒకటి నుంచి ఆరంభం కానుందని వెల్లడించిందిప్రతి ప్రభుత్వోద్యోగి ఇ-ఎస్ఆర్ నమోదు, నవీకరణలు సెప్టెంబర్ ఒకటి నుంచి తప్పనిసరి చేసినట్టు ఉత్తరువులలో వివరించారు. రాష్ట్ర స్దాయిలో సచివాలయం, హెచ్?ఓడి కార్యాలయాల్లో ఇ-ఎస్ఆర్?లో వివరాలు నమోదు చేసిన డాక్యుమెంట్ లను అప్లోడ్ చేసేందుకు ఆగస్టు ఐదు వరకు అవకాశం కల్పించారు. హెచ్ ఆర్ మేనేజర్ల వెరిఫికేషన్ ప్రక్రియ ఈనెల 25 నుంచి ఆగస్టు 31 వరకు పూర్తి చేస్తారు జిల్లాలలోనూ, ఇతర కార్యాలయాల్లో ఉద్యోగులు ఇ-ఎంఆంలో ప్రాధమిక నమోదు ప్రక్రియ ఆగస్టు ఒకటి నుంచి ఆరంభంమవుతుంది. ఇప్పటి వరకు ఉన్న ఎస్ఆర్?లలో వివరాలన్నీ స్కాన్డ్ కాపీలు, డాక్యుమెంట్లను అప్లోడ్ చేసేందుకు ఆగస్టు 15 వరకు గడువు విధించారు. వీటిని హెచ్ మేనేజర్, ప్రధాన కార్యాలయంలో ఆగస్టు 31 వరకు తనిఖీ ప్రక్రియ పూర్తి చేస్తారు.ఆన్ లైన్ లో మాత్రమే నమోదు చేయాలి సెప్టెంబర్ ఒకటి నుంచి ప్రతి ప్రభుత్వోద్యోగి ఎంఆర్?లో వివరాలన్నీ ఆన్‌లైన్‌లో మాత్రమే నమోదు చేయాల్సి ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.




ఎంఆర్ డిజిటలైజేషన్ వల్ల వార్షిక ఇంక్రిమెంట్లు, పే ఫిక్సేషన్, పదోన్నతులు, బదిలీలు, సెలవులు, సస్పెన్షన్లు, తిరిగి విధుల్లోకి నియామకాలు, ప్రొబేషన్ డిక్లరేషన్ వంటి సర్వీసు విషయాలన్నీ ఆన్‌లైన్‌లోనే లైవ్ గా నమోదవుతాయి. దీనివల్ల పేరోల్ అప్డేషన్, పింఛన్ వంటివి త్వరగా ప్రాసెస్ చేసేందుకు వీలవుతుందని ప్రభుత్వం ఉత్తర్వులలో స్పష్టం చేసింది.ఏపీసీఎఫఎంఎస్ ముఖ్య కార్యనిర్వహణాధికారి మెరుగైన ఇ-ఎస్ఆర్ అప్లికేషన్‌ను అమలు పర్యవేక్షించాలని నిర్దేశించారు. సచివాలయ పరిపాలనా విభాగాలు, విభాగాధిపతులు, జిల్లా కలెక్టర్లు, కార్యాలయాల అధిపతులు, డ్రాయింగ్ డిస్బర్సింగ్ అధికారులు, హెచ్ఆర్ మేనేజర్లు అందరూ నిర్దేశించిన సమయంలోగా ఈ ప్రక్రియ పూర్తయ్యేలా చూసేందుకు, డేటా ఎంట్రీ, ధ్రువీకరణ ఆమోదం పురోగతిని నిశితంగా పర్యవేక్షించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అరెస్ట్‌కు ఆదేశాలు ఇచ్చి రద్దు చేసిన ధర్మాసనం



లోతుకుంటలోని ప్రైవేటు భూమిలోకి వెళ్లొద్దన్న ఉత్తర్వులను మూడోసారి ధిక్కరించిన హైడ్రాకోర్టు ఆదేశాలను ఉల్లంఘించినందుకు రంగనాథ్‌ను అరెస్టు చేయాలని తొలుత ఆదేశించిన హైకోర్టులాయర్ల విజ్ఞప్తితో అరెస్ట్ రద్దు.. సాయంత్రం 6.30 గంటలకు వ్యక్తిగతంగా హాజరైన రంగనాథ్‌రంగనాథ్ వ్యవహారశైలిపై జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలుఈ రాష్ట్రంలో 'రూల్ ఆఫ్ లా' అనేది ఒకటి ఉందని గుర్తుచేసిన న్యాయస్థానం మల్కాజిగిరి లోతుకుంటలోని శాంత శ్రీరాం కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేటు భూమి విషయంలో కోర్టు ఆదేశాలను వరుసగా మూడుసార్లు ధిక్కరించినందుకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ముందుగా ఆయనను అరెస్టు చేయాలని ఆదేశించినప్పటికీ, ప్రభుత్వ న్యాయవాదుల విజ్ఞప్తితో ఉపసంహరించుకుని వ్యక్తిగతంగా హాజరుకావాలని స్పష్టం చేసింది.సాయంత్రం జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం ఎదుట హాజరైన రంగనాథ్ కోర్టు చివరి వరుసలో నిలబడ్డారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మండిపడుతూ.. రంగనాథ్ తీరు 'అలవాటుపడ్డ నేరగాడిలా' ఉందని, ప్రభుత్వ అధికారికి ఇంత అహంకారం తగదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో 'రూల్ ఆఫ్ లా' ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. హైడ్రా విధివిధానాలు కేవలం చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణకేనని, ప్రైవేటు భూముల్లో జోక్యం చేసుకోకూడదని తేల్చిచెప్పారు. ఇకపై ఆ స్థలంలోకి వెళ్లబోమని ఏజీ హామీ ఇవ్వగా, పిటిషనర్‌కు ఎఫ్ఐఆర్ కాపీని తక్షణమే ఇవ్వాలని కోర్టు హోంశాఖను ఆదేశించింది.

# మీర్‌పేట్‌లో దారుణం

**రౌడీ షీటర్ సూరి దారుణ హత్య**



పాత పగల నేపథ్యంలోనే జరిగిందని పోలీసుల అనుమానం కళ్లలో కారం చల్లి, కత్తులతో దారుణంగా దాడి చేసిన ప్రత్యర్థులు గతంలో బావమరిదిని హత్య చేసిన కేసులో సూరి నిందితుడుప్రధాన నిందితుడు అఫ్రోజ్ కోసం గాలిస్తున్న పోలీసులుహైదరాబాద్ నగరంలోని మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం తీవ్ర కలకలం చోటుచేసుకుంది. పాత నేరస్థుడైన నందనవనం సూరిని ప్రత్యర్థులు దారుణంగా హత్య చేశారు. పాత కక్షల నేపథ్యంలోనే ఈ హత్య జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మీర్‌పేట్‌లోని టీకేఆర్ కళాశాల సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గతంలో సూరి చేతిలో హత్యకు గురైన వ్యక్తి సోదరుడు అఫ్రోజ్, పక్కా పథకం ప్రకారం సూరిని అక్కడికి రప్పించాడు. సూరి రాగానే, దుండగులు తొలుత అతని కళ్లలో కారం పొడి చల్లి ప్రతిఘటించకుండా చేశారు. అనంతరం కత్తులతో విచక్షణారహితంగా దాడి చేయడంతో సూరి అక్కడికక్కడే కుప్పకూలాడు. ఆసుపత్రికి తరలించేలోపే అతను మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.మృతుడు సూరిపై గతంలో పలు క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయి. తన భార్యతో పాటు బావమరిది సల్మాన్‌ను హత్య చేసిన కేసులో అతను ప్రధాన నిందితుడు. అతని నేర చరిత్రను దృష్టిలో ఉంచుకుని, పోలీసులు కొన్ని నెలల క్రితమే అతడిని నగరం నుంచి బహిష్కరించారు. ఈ క్రమంలోనే వ్యక్తిగత కక్షల కారణంగా ఈ హత్య జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ప్రధాన నిందితుడు అఫ్రోజ్‌తో పాటు ఈ దాడిలో పాల్గొన్న ఇతర వ్యక్తుల కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి గాలిస్తున్నారు.

## సంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం




ముగ్గురు కుటుంబసభ్యులు మృతి సంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం బైక్‌ను తప్పించబోయి బోల్తాపడిన స్కార్పియో వాహనం మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి హైదరాబాద్ వస్తుండగా ఘటన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు సంగారెడ్డి జిల్లాలో మంగళవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. నిజాంపేట మండలం బాచుపల్లి సమీపంలోని 161వ జాతీయ రహదారిపై ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మహారాష్ట్రకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మరణించారు. వారు ప్రయాణిస్తున్న స్కార్పియో వాహనం అదుపుతప్పి బోల్తా పడటంతో ఈ దారుణం జరిగింది.ప్రమాద వివరాల్లోకి వెళితే.. మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి ఒక కుటుంబం స్కార్పియో వాహనంలో హైదరాబాద్‌కు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మార్గమధ్యంలో ఎదురుగా వస్తున్న ఒక ద్విచక్ర వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయాడు. దీంతో కారు పల్టీలు కొట్టగా, అందులో ప్రయాణిస్తున్న భార్యాభర్తలతో పాటు వారి నాలుగేళ్ల కుమార్తె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.స్థానికుల సమాచారంతో పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

RNI TGTEL/25/A5065
vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



# ఒకే రోజు 20 శాతం పెరిగిన ఫార్మా స్టాక్

## ఒక నెలలోనే 43 శాతం జంప్




సోమవారం ఫార్మా స్టాక్స్ ర్యాలీ కనిపించింది. ప్రముఖ ఫార్మా స్టాక్ అయిన తత్వ చింతన్ కెమ్ షేర్ ప్రైస్ సోమవారం ఉదయం 10:06 గంటలకు బీఎస్ఈలో 20 శాతం పెరిగి అప్పర్ సర్క్యూట్ వద్ద లాక్ అయింది. ఈ రోజు ఈ స్టాక్ రూ.285 పెరిగి రూ. 1,713కు చేరింది. ఇది 52 వారాల గరిష్ట స్థాయికి చేరుకుంది. 23 లక్షల (2.3 మిలియన్ల) ఈక్విటీ షేర్లు చేతులు మారాయి. జూలైలో ఇప్పటివరకు తత్వ చింతన్ ఫార్మా కెమ్ షేరు ధర 43 శాతం పెరిగింది. ఈ స్టాక్ 2025 నవంబర్ 18న ఈ స్టాక్ ప్రైస్ రూ.1,603దా ఉండేది. అలాగే 2021 నవంబర్ 3న ఈ స్టాక్ రూ.2,975 వద్ద రికార్డు స్థాయి గరిష్టాన్ని తాకింది. జూన్ 30, 2026 త్రైమాసికం ముగిసే సమయానికి పెట్టుబడిదారుడు ముకుల్ మహావీర్ అగర్వాల్ తత్వ చింతన్ ఫార్మా కెమ్‌లో 2.14 శాతం హోల్డ్ చేస్తున్నారు. ముకుల్ అగర్వాల్ కు హింద్ రెక్టిఫైయర్స్, న్యూల్యాండ్ లాబొరేటరీస్, ఇండో కౌంట్ ఇండస్ట్రీస్, రాడికో ఖైతాన్, టెక్నాలజీస్, ఇండస్ట్రీస్, నువామా వెల్త్ మేనేజ్‌మెంట్‌తో సహా 74 స్టాక్‌లలో 1 శాతం కంటే ఎక్కువ వాటా ఉంది. తత్వ చింతన్ ఫార్మా కెమ్ ప్రధానంగా ప్రత్యేక రసాయనాల తయారీ, అమ్మకం, పంపిణీ చేస్తోంది. వీటిలో ఫేజ్ ట్రాన్స్‌ఫర్ ఉత్ప్రేరకాలు, స్ట్రక్చర్ డైరెక్టింగ్ ఏజెంట్లు, ఎలక్ట్రోలైట్ లవణాలు, ద్రావణాలు, ఫార్మాస్యూటికల్, అగ్రోకెమికల్ ఇంటర్మీడియట్స్ ఉన్నాయి. తత్వ చింతన్ ఫార్మా కెమ్ పన్ను తర్వాత లాభం రెట్టింపు అయింది. లాభం రూ.16 కోట్లుగా ప్రకటించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఇది ?6.7 కోట్లుగా ఉంది. ఎబిట్డా మార్జిన్ 15 శాతం నుంచి 19 శాతానికి చేరింది. ప్రపంచ రసాయన పరిశ్రమలో చైనా 46 శాతం వాటాను కలిగి ఉంది. భారతదేశం కేవలం 1-2 శాతం వాటాను మాత్రమే కలిగి ఉంది. చైనా పోటీతత్వం తగ్గడం వల్ల కలిగే సానుకూల ప్రభావం, భారత్ తన మార్కెట్ వాటాను పెంచుకునే ప్రయత్నాలను ముమ్మరం చేయడానికి మార్గం సుగమం చేసిందని కంపెనీ పేర్కొంది. గుజరాత్‌లోని భరూచ్ జిల్లా దహేజ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని 'దహేజ్ వద్ద ఉన్న కొత్త గ్రీన్‌ఫీల్డ్ యూనిట్‌లో వివిధ ప్రత్యేక రసాయనాల తయారీ సామర్థ్యాన్ని పెంచే ప్రతిపాదనకు తమ బోర్డు ఆమోదం తెలిపింది. ఈ కొత్త తయారీ కేంద్రం కంపెనీ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయడమే కాకుండా, పెరుగుతున్న మార్కెట్ డిమాండ్లను తీర్చడంలో సహాయపడుతుందని తత్వ చింతన్ ఫార్మా పేర్కొంది. ఈ కంపెనీకి ఎస్డీఏ, పీటీసీ, పీఏఎస్సీ నుంచి ఎక్కువ ఆదాయం వచ్చిందని ఐసీఐసీఐ సెక్యూరిటీస్ విశ్లేషకుల చెబుతున్నారు. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# వచ్చే మూడు నుంచి ఐదేళ్లలో బంగారం ధర తగ్గుతుంది

## యెస్ సెక్యూరిటీస్ రిసెర్చ్ నివేదిక

గత సంవత్సరన్నరగా బంగారం ధర భారీగా పెరిగింది. సంవత్సరం క్రితం గోల్డ్ లో పెట్టుబడి పెట్టిన వారు భారీ లాభం పొందారు. ప్రస్తుతం బంగారం ధర రూ.1,43,000 నుంచి రూ.1,48,000 మధ్య పెరుగుతూ తగ్గుతూ వస్తుంది. అయితే ఈ సమయంలో పసిడిలో పెట్టుబడి పెట్టడం సరైందేనా. లేక ఇంకా కొద్ది కాలం ఆగాలా అని చాలా మందికి సందేహాలు ఉన్నాయి. అయితే బంగారం ధరకు సంబంధించి యెస్ సెక్యూరిటీస్ ఓ పరిశోధన నివేదిక విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం వచ్చే మూడు నుంచి ఐదు సంవత్సరాలలో తక్కువ రాబడి ఇచ్చే అవకాశం ఉందని అంచనా వేసింది. బుల్ మార్కెట్ లేకపోవడం, తక్కువ వాస్తవ వడ్డీ రేట్లు, ద్రవ్య విస్తరణ, భౌగోళిక రాజకీయ అనిశ్చితి, సెంట్రల్ బ్యాంకుల నిరంతర కొనుగోళ్ల మద్దతుతో బంగారం ధర భారీగా పెరిగిందని వివరించింది. కానీ.. భవిష్యత్ లో బంగారం ఇదే స్థాయిలో పెరిగే అవకాశం లేదని అంచనా వేసింది. అదే సమయంలో ఆర్థిక శక్తులు విలువైన లోహాల కంటే పారిశ్రామిక వస్తువులకు అనుకూలంగా ఉంటాయని తెలిపింది. ఏఐ, మౌలిక సదుపాయాలు, విద్యుదీకరణ, రక్షణ రంగ తయారీ మరియు రీషోరింగ్ కార్యక్రమాల వల్ల రాగి, అల్యూమినియం, విద్యుత్ పరికరాలు, ప్రత్యేక ఉక్కు, యురేనియంకు డిమాండ్ ఉంటుందని అంచనా వేసింది. అయితే 2026 చివరి త్రైమాసికం నాటికి ఔన్సుకు ధరలు సగటున 6,000 డాలర్లకు చేరుకుంటాయని జె.పి. మోర్గాన్ గ్లోబల్ రీసెర్చ్ అంచనా వేసింది. 2027 చివరి నాటికి 6,300 డాలర్లకు పెరుగుతుందని పేర్కొంది. గారం ఒకరకమైన సాంకేతిక అనిశ్చిత స్థితిలో చిక్కుకుందని తెలిపింది. ఫెడ్ వడ్డీ రేట్ల పెంపుతో స్పందించాల్సి వస్తుందేమోనన్న ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో చాలా మంది పెట్టుబడిదారులు ప్రస్తుతానికి బంగారంపై అంతగా దృష్టి పెట్టడం లేదని పేర్కొంది. పశ్చిమ ఆసియా ఉద్రిక్తతల నేపథ్యంలో పసిడిపై మాత్రమే కాకుండా పెట్టుబడుల వైవిధ్యీకరణ కొనసాగుతుందని వివరించింది. అధిక ద్రవ్యోల్బణం, కొనుగోలు శక్తి క్షీణించండం, అమెరికా ఆర్థిక, బడ్జెట్ ఆందోళనలు, భౌగోళిక రాజకీయ పరిస్థితులపై బంగారం ధర ఆధారపడే అవకాశం ఉందని అంచనా వేసింది.




డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# ఉద్యోగులకు యాక్సెంచర్ సర్ప్రైజ్

## సగం జీతం, మరో సగం క్యాష్

## కొత్త పే మోడల్ పూర్తి వివరాలివే




ప్రముఖ ఐటీ దిగ్గజం యాక్సెంచర్ తన ఉద్యోగుల జీతాల పెంపు విధానంలో కీలక మార్పులను తీసుకొచ్చింది. నూతనంగా ప్రవేశపెట్టిన ఈ వేతన నమూనా భారతదేశంలోని సుమారు 3.5 లక్షల మంది ఉద్యోగులతో పాటు ప్రపంచవ్యాప్తంగా పనిచేస్తున్న కంపెనీ సిబ్బందికి జూన్ జీతాల సమీక్ష ప్రక్రియ నుండి అమలులోకి వచ్చింది. ఈ కొత్త విధానం ప్రకారం ఒక ఉద్యోగికి ఆమోదించబడిన మొత్తం జీతం పెంపులో కేవలం 50 శాతం మాత్రమే వారి శాశ్వత మూల వేతనానికి జోడించడం జరుగుతుంది. మిగిలిన 50 శాతం మొత్తాన్ని జూన్ నెలలో ఒకేసారి ఏకమొత్తంగా నగదు రూపంలో విడిగా చెల్లిస్తారు. ఉదాహరణకు ఒక ఉద్యోగికి 3 శాతం జీతం పెంపు ఖరారైతే, అందులో 1.5 శాతం భాగం మాత్రమే ప్రతి నెల వచ్చే మూల వేతనంలో పెరుగుతుంది. మిగిలిన 1.5 శాతం మొత్తాన్ని జూన్‌లో ఒకే విడతలో నగదుగా పొందుతారు. అయితే పదోన్నతి పొందిన ఉద్యోగులకు లభించే పెంపును మాత్రం 100 శాతం వారి మూల వేతనానికే యాడ్ చేస్తారని కంపెనీ తెలిపింది. అలాగే జూన్‌లో ఇచ్చే ఈ ఏకమొత్తం నగదు చెల్లింపునకు.. ప్రతి ఏటా డిసెంబర్‌లో నిర్వహించే వార్షిక బోనస్ సైకిల్‌తో ఎలాంటి సంబంధం ఉండదని స్పష్టం చేసింది. ఈ నూతన నమూనా వెనుక ఉన్న ఉద్దేశాలను వెల్లడిస్తూ.. గత ఏడాది పరిమిత సంఖ్యలోనే మూల వేతన పెంపులు జరిగాయని, అయితే ఈసారి పెంపును శాశ్వత జీతం, ఏకమొత్తం నగదుగా విభజించడం ద్వారా ఎక్కువ మంది ఉద్యోగులకు మూల వేతన పెంపు పరిధిలోకి తీసుకురావడానికి వీలు కలిగిందని కంపెనీ పిటిఐతో పంచుకున్న మెమో ద్వారా వివరించింది. అంతేకాకుండా ఈ విధానం వల్ల ఉద్యోగుల చేతికి తక్షణమే ఎక్కువ నగదు అందుతుందని కంపెనీ భావిస్తోంది. వేతన చెల్లింపు పద్ధతి మారినప్పటికీ.. అప్రైజల్ నిర్ణయాలు మాత్రం ఉద్యోగుల నైపుణ్యాలు, పనితీరు, ప్రాజెక్టు ప్రభావం, ప్రవర్తన ఆధారంగానే కొనసాగుతాయి. ఇాశ్రీంశీ =ఝుం ఐటీ రంగంలో రక్తపాతం.. యాక్సెంచర్ ఫలితాలతో భయాందోళనలో ఇన్వెస్టర్లు.. మార్కెట్ ఎందుకు అంతలా కుప్పకూలింది.. కాగా ఈ నిర్ణయంపై ఉద్యోగుల నుంచి మిశ్రమ స్పందనలు వస్తున్నాయి. తక్షణ నగదు లభ్యత బాగున్నప్పటికీ.. మూల వేతనం ఆశించిన స్థాయిలో పెరగకపోవడం పట్ల కొందరు అసంతృప్తిగా ఉన్నారు. అంతేకాకుండా, ఈ ఒకేసారి చెల్లించే మొత్తంపై పన్నులు ఏ విధంగా వర్తిస్తాయి. ఈ విధానం కేవలం ఈ ఏడాదికే పరిమితమా లేక భవిష్యత్తులోనూ కొనసాగుతుందా అనే అంశాలపై ఉద్యోగులు స్పష్టత కోరుతున్నారు. గ్లోబల్ ఐటీ రంగంలో వ్యయ నిర్వహణ ప్రాధాన్యంగా మారిన తరుణంలో.. శాశ్వత ఆర్థిక భారాన్ని తగ్గించుకోవడానికి కంపెనీలు ఇటువంటి వినూత్న మార్గాలను ఎంచుకుంటున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

# కొత్త రంగుల్లో ఐఫోన్ 18 ప్రో.. పెదవి విరుస్తున్న అభిమానులు!

ప్రముఖ దిగ్గజ టెక్ సంస్థ యాపిల్ త్వరలోనే విడుదల చేయనున్న ఐఫోన్ 18 ప్రో సిరీస్‌పై రకరకాల వార్తలు టెక్ వర్గాల్లో చక్కర్లు కొడుతున్నాయి. సెప్టెంబరులో అధికారికంగా లాంచ్ కానున్న ఈ ఫ్లాగ్‌షిప్ స్మార్ట్‌ఫోన్ డిజైన్, ఫీచర్లకు సంబంధించి లీకైన కొన్ని వివరాలు వినియోగదారులను కొంతవరకు అసంతృప్తికి గురిచేస్తున్నాయి. ప్రత్యేకించి ఫోన్ మందం, బరువు, అందుబాటులో ఉండే రంగుల విషయంలో పలు ఊహాగానాలు బయటకు వచ్చాయి.లీకైన వివరాల ప్రకారం.. నయా ఐఫోన్ 18 ప్రో, ప్రో మ్యాక్స్ మోడళ్లు ప్రస్తుత ఐఫోన్ 17 ప్రో కంటే దాదాపు 2 మిమీ వరకు ఎక్కువ మందంతో ఉండే అవకాశముంది. ప్రముఖ టిప్‌స్టర్ల కథనం ప్రకారం ఈ ఫోన్‌ల మందం 10.75 మిమీ వరకు పెరగవచ్చు. అయితే, కొన్ని నివేదికలు కేవలం బ్యాక్ కెమెరా బంప్ పరిమాణం పెరగడం వల్లే ఈ వ్యత్యాసం కనిపిస్తుందని, ఫోన్ ప్రధాన బాడీ మందం 8.75 మిమీ మాత్రమే ఉంటుందని పేర్కొంటున్నాయి.మరో ప్రధాన మార్పు ఫోన్ బరువులో కనిపిస్తోంది. కొత్త ప్రో మ్యాక్స్ మోడల్ బరువు 240 గ్రాములకు చేరవచ్చని అంచనా. ఇది ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్ (233 గ్రాములు) కంటే ఏడు గ్రామాలు ఎక్కువ. ఇప్పటికే చేతిలో పట్టుకోవడానికి బరువుగా ఉన్నాయనే విమర్శలు ఉండగా, కొత్త వెర్షన్ మరికొంత బరువు పెరగడం పట్ల వినియోగదారులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.అన్నింటికంటే ముఖ్యంగా, యాపిల్ ఐఫోన్ ప్రో సిరీస్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన 'బ్లాక్'కలర్ వేరియంట్‌ను ఈసారి నిలిపివేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దానికి బదులుగా డార్క్ చెర్రీ, లైట్ బ్లూ, సిల్వర్ రంగులలో మాత్రమే ఈ ఫోన్ లభించనుందని నివేదికలు చెబుతున్నాయి. ఒకవేళ ఇవే వార్తలు నిజమైతే, సన్నగా, తేలికగా ఉండే నలుపు రంగు ఐఫోన్ కోరుకునే వినియోగదారులకు ఇది కొంత ప్రతికూల వార్తగానే భావించవచ్చు. అయితే,




యాపిల్ సంస్థ అధికారికంగా వెల్లడించే వరకు ఈ లీక్స్‌ను కేవలం అంచనాలుగానే చూడాలని నిపుణులు సూచిస్తున్నారు.

# 20 ఏళ్లలో అదిరిపోయే రాబడులు




## ఇచ్చిన మ్యూచువల్ ఫండ్లు ఇవే

చాలా మంది భవిష్యత్ కోసం పొదుపు చేస్తుంటారు. ఇల్లు కొనుగోలు చేయడానికి లేదా పిల్లల చదువుకు లేదా రిటైర్మెంట్ కోసం డబ్బులు పొదుపు చేస్తారు. పొదుపు చేస్తున్న డబ్బు ఎక్కడ పెట్టుబడి పెట్టామని ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. మీరు మీ లక్ష్యాన్ని బట్టి పెట్టుబడి పథకాలను ఎంచుకోవాలని చెబుతున్నారు. దీర్ఘకాలిక లక్ష్యాలు అయితే మీరు మీ పొదుపులో కొంత మొత్తాన్ని మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టడం బెటరని సూచిస్తున్నారు. పలు రకాల మ్యూచువల్ ఫండ్లు దీర్ఘకాలంలో మంచి రాబడులు ఇచ్చాయి. అయితే మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి రిస్క్ తో కూడుకున్నదని గుర్తుంచుకోవాలి. అయితే గత 20 ఏళ్లలో దాదాపు ఏడు ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లు మంచి రాబడులను ఇచ్చాయి. 20 ఏళ్లలో పెట్టుబడిని 22 రెట్లు చేశాయి. ఇందులో లార్జ్ క్యాప్ ఫండ్స్, మిడ్ క్యాప్ ఫండ్స్,ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్ ఉన్నాయి. నిప్పాన్ ఇండియా గ్రోత్ మిడ్ క్యాప్ ఫండ్ గత 20 ఏళ్లలో 16.8 శాతం రాబడి ఇచ్చింది. ఇది పెట్టుబడిదారుల డబ్బును 22.4 రెట్లకు పెంచింది. హెచ్డీఎఫ్సీ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ గత 20 ఏళ్లలో 15.4 శాతం రాబడి ఇచ్చింది. పెట్టుబడిదారుల డబ్బును 17.6 రెట్లు పెంచింది. అలాగే ఫ్రాంక్లిన్ ఇండియా మిడ్ క్యాప్ ఫండ్ 20 సంవత్సరాల్లో పెట్టుబడిదారుల డబ్బును 16.9 రెట్లు కు పెంచింది. ఫ్రాంక్లిన్ ఇండియా ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ గత 20 ఏళ్లలో పెట్టుబడిదారుల డబ్బును 15.8 రెట్లకు పెంచింది. ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ 20 సంవత్సరాల్లో 14.43 రాబడి ఇచ్చింది. పెట్టుబడిదారుల డబ్బును 14.4 రెట్లకు పెంచింది. ఆదిత్య బిర్లా సన్ లైఫ్ లార్జ్ క్యాప్ ఫండ్ గత 20 ఏళ్లలో పెట్టుబడిదారుల డబ్బును 13.5 రెట్లకు పెంచింది. ఈ ఫండ్ 13.9 శాతం రాబడిని అందించింది. హెచ్డీఎఫ్సీ లార్జ్ క్యాప్ ఫండ్ గత 20 ఏళ్లలో 13.7 శాతం రాబడి ఇచ్చింది. పెట్టుబడిదారుల డబ్బును 13 రెట్లు చేసింది. ఈ ఏడు ఫండ్లు గత 15 ఏళ్లలో పెట్టుబడిదారుల సంపదను 10 రెట్ల వరకు పెంచాయి. మ్యూచువల్ ఫండ్లలో స్మాల్ క్యాప్ ఫండ్ లో రిస్క్ ఎక్కువ ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అలాగే లార్జ్ క్యాప్, మిడ్ క్యాప్, ఫ్లెక్సీ క్యాప్ మ్యూచువల్ ఫండ్లలో రిస్క్ కాస్త తక్కువగా ఉంటుందని చెబుతున్నారు. అందుకే మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు వైవిధ్యంగా ఉండాలని చెబుతున్నారు. మీ సొమ్ము మొత్తాన్ని ఒకే ఫండ్ లో కాకుండా డైవర్సిఫై చేయాలని సూచిస్తున్నారు. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి లేదా అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# బంగారం రూ.1.45 లక్షలు,




# వెండి రూ.2.27 లక్షలు

## గోల్డ్, సిల్వర్ ధరలపై నిపుణులు తాజా అంచనాలు ఇవే

బంగారం, వెండి ధరలు ఏ క్షణం ఎలా మారుతున్నాయో అర్థం కావడం లేదు. పసిడి, సిల్వర్ ధరలు ఇటీవల కాలంలో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నప్పటికీ.. మార్కెట్‌లో తిరిగి కొనుగోళ్లు పెరిగితే వీజీఃు గోల్డ్ రూ.1.45 లక్షలు (10 గ్రాములు), వీజీః సిల్వర్ రూ.2.27 లక్షలు (కిలో) స్థాయిలను చేరుకునే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే ఈ లక్ష్యాలను చేరుకోవడం అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయాలు, డాలర్ బలం, ట్రెజరీ ఈల్డ్స్, ద్రవ్యోల్బణ గణాంకాలు, అలాగే మధ్యప్రాచ్య భౌగోళిక ఉద్రిక్తతలపై ఆధారపడి ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు నువామా ప్రొఫెషనల్ క్లయింట్స్ గ్రూప్ ఫారెక్స్ ఊ కమోడిటీస్ హెడ్ అభిలాష్ కోయిక్కర విశ్లేషణల ప్రకారం.. కొంతకాలంగా మార్కెట్లో బలహీనతను చవిచూసిన వెండి ధరలు ఇప్పుడు తిరిగి కోలుకునే స్పష్టమైన సంకేతాలను చూపిస్తున్నాయి. సాంకేతిక సూచికలను పరిశీలిస్తే.. సమీప భవిష్యత్తులో ఈ విలువైన లోహాల ధరలు మరింత పుంజుకునే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయని చెబుతున్నారు. ఇటీవలి కాలంలో చోటుచేసుకున్న విక్రయాల ఒత్తిడి కారణంగా మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ లో బంగారం ధరలు ఓవర్‌సోల్డ్ జోన్‌లోకి ప్రవేశించాయి. మార్కెట్ విశ్లేషణల ప్రకారం.. ఇటువంటి పరిస్థితులు తరచుగా తక్కువ ధరకు కొనుగోళ్లు పెరగడానికి, షార్ట్ పొజిషన్ల కవరింగ్‌కు దారితీసి ధరల పునరుద్ధరణ ర్యాలీని సృష్టిస్తాయి. ప్రస్తుతం ఎంసీఎక్స్ మార్కెట్లో ధరలకు రూ. 1,40,000 స్థాయి ఒక అత్యంత బలమైన మద్దతు ధరగా పనిచేస్తుందని అంచనా వేస్తున్నారు. బంగారం, వెండి కొనుగోలుదారులకు అలర్ట్.. 69కి చేరిన పసిడి, సిల్వర్ రేషియో..ఏది కొనాలనే దానిపై నిపుణులు కీలక సూచన ధరలు ఈ కీలక మద్దతు స్థాయికి పైన కొనసాగినంత కాలం పసిడి సెంటిమెంట్ బలంగా ఉంటుంది. దీనివల్ల రాబోయే సెషన్లలో బంగారం ధరలు రూ. 1,44,000 నుండి రూ. 1,45,000 మధ్యలో నిరోధక స్థాయిల వైపు కదిలేందుకు మార్గం సుగమం అవుతుంది. ఒకవేళ మార్కెట్ ఈ మద్దతు ధర కంటే కిందకు పడిపోతే మాత్రం అమ్మకాల ఒత్తిడి మొదలయ్యే ప్రమాదం ఉంది. ప్రస్తుత మార్కెట్ ధర రూ. 1,42,000 వద్ద ఉన్న నేపథ్యంలో.. ట్రేడర్లు రూ. 1,45,000 లక్ష్యంతో కొనుగోళ్లు జరపవచ్చని.. అలాగే నష్టాలను నివారించడానికి రూ. 1,40,000 వద్ద స్టాప్ లాస్ పాటించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. బంగారు వ్యాపార వ్యూహం ఇదే.. ఎంట్రీ: 142,000 ( ప్రస్తుత ధర) లక్ష్యం: 145,000 (కొనుగోలు ఆపే స్థాయి) స్టాప్ లాస్: 140,000 ( కొనుగోలు చేసే స్థాయి) వెండి వ్యాపార వ్యూహం ఇదే.. ఎంట్రీ: 221,500 లక్ష్యం: 227,000 స్టాప్ లాస్: 218,000 బంగారం బాటలోనే ఎంసీఎక్స్ వెండి ధరలు కూడా స్వల్పకాలంలో బలాన్ని పుంజుకునేందుకు సిద్ధంగా ఉన్నాయి. వెండికి సంబంధించిన మెజారిటీ మొమెంటం ఆసిలేటర్లు కూడా ఓవర్‌సోల్డ్ జోన్‌లోకి జారిపోవడంతో.. ఇటీవలి ధరల క్షీణత ముగింపు దశకు చేరుకుందని స్పష్టమవుతోంది. ఇది మార్కెట్లో తక్కువ ధరకు కొనుగోళ్లు పెరగడానికి.. షార్ట్-కవరింగ్ ర్యాలీ రావడానికి బలమైన అవకాశాలను కల్పిస్తోంది. ప్రస్తుతం వెండి ధరలకు రూ. 2,18,000 వద్ద ఒక పటిష్టమైన మద్దతు లభిస్తోంది. ఇది ధరలు మరింత పతనం కాకుండా అడ్డుకుంటోంది. మార్కెట్ ఈ స్థాయికి పైన విజయవంతంగా నిలదొక్కుకుంటే, బుల్లిష్ సెంటిమెంట్




## ప్రభాస్ ఫౌజీ.. రెబల్ స్టార్ పవర్‌ఫుల్ రోల్..!

రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తోన్న పాన్ ఇండియా చిత్రం ఫౌజీ. ఈ మూవీకి హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. ఇందులో ప్రభాస్ ఆజాద్ హింద్ ఫౌజ్ సైనికుడిగా కనిపించనున్నారని తెలుస్తోంది. నేతాజీ సుభాశ్ చంద్రబోస్ నాయకత్వంలో భారత స్వాతంత్ర్యం కోసం ఆయన చేసే పోరాటమే ప్రధానంగా తెరకెక్కించనున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో ప్రభాస్ ముందుగా బ్రిటీష్ ఇండియన్ ఆర్మీలో సైనికుడిగా పనిచేసి.. ఆ తర్వాత సుభాశ్ చంద్రబోస్ నేతృత్వంలోని ఆజాద్ హింద్ ఫౌజ్‌లో చేరుతాడని తెలుస్తోంది. ఇది కేవలం నేతాజీ బయోపిక్ మాత్రమే కాదని.. అంతే కాకుండా ఇండియన్ ఫ్రీడమ్ కోసం పోరాడిన సైనికుల కథను చూపించే చిత్రంగా ఉండనుందని టాక్. ఈ మూవీలో ప్రభాస్ పాత్ర ధైర్య సాహసాలు, త్యాగం, దేశభక్తితో నిండి ఉంటుందని సమాచారం. అయితే దీనిపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటనైతే రాలేదు. ఈ చిత్రాన్ని డిసెంబరు 3న ఫౌజీ విడుదల కానుందని తాజాగా పోస్టర్‌ను పంచుకుంది. ఈ పోస్టర్‌లో ఎప్పుడు చూడని లుక్‌లో ప్రభాస్ కనిపించారు. దీంతో అభిమానుల్లో అంచనాలు పెంచేసింది. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన ఇమాన్వి హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ చిత్రంలో మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్, జయప్రద కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ భారీ యాక్షన్ మూవీ డిసెంబర్ 3న థియేటర్లలో సందడి చేయనుంది. కాగా.. ప్రభాస్ ఫౌజీతో పాటు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో నటిస్తున్నారు. వీరిద్దరి కాంబోలో స్పిరిట్ చిత్రంలో కనిపించనున్నారు. ఈ మూవీలో త్రిప్తి దిమ్రీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఆ తర్వాత సలార్: పార్ట్ 2, కల్కి 2898 ఏడీ: పార్ట్ 2 సినిమాలు చేస్తున్నారు.

# 10 రోజుల్లో అక్కినేని అఖిల్ 'లెనిన్' రికార్డు వసూళ్లు

టాలీవుడ్ యాక్టర్ అక్కినేని అఖిల్ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'లెనిన్'. మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహించిన ఈ మూవీలో మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించింది. జులై 10న గ్రాండ్‌గా విడుదలైన ఈ చిత్రం నిర్మాతలకు కాసుల వర్షం కురిపిస్తూ అఖిల్ కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. లెనిన్ 10 రోజుల సక్సెస్‌ఫుల్ థియాట్రికల్ రన్‌లో వరల్డ్ వైడ్‌గా రూ.88 కోట్లు సాధించింది. ఈ విషయాన్ని మేకర్స్ అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు.

ఈ అరుదైన సందర్భాన్ని పురస్కరించుకుని ఇవాళ సాయంత్రం లెనిన్ టీం హైదరాబాద్‌లో సక్సెస్ మీట్ ఏర్పాటు చేయనుంది. ఈవెంట్‌కు అక్కినేని నాగచైతన్య చీఫ్ గెస్ట్‌గా రాబోతున్నాడు. ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన తర్వాత ఈ మూవీని అన్నపూర్ణ స్టూడియోస్‌తోపాటు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై అక్కినేని నాగార్జున, నాగ వంశీ సంయుక్తంగా నిర్మించారు. రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా వచ్చిన ఈ చిత్రంలో శివాజీ, సునీల్ కీ రోల్స్‌లో నటించారు. ఈశ్వరీరావ్, బ్రహ్మాజీ, ప్రమోద్ పంజు కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి ఎస్ థమన్ మ్యూజిక్ అందించాడు. లెనిన్ థియాట్రికల్ రన్ తర్వాత జీ5 ఓటీటీ ప్లాట్‌ఫాంలో ప్రీమియర్ కానుంది. అంతేకాదు జీ తెలుగు, జీ సినిమాలులో టెలివిజన్ ప్రీమియర్ కానుంది






# అర్థం చేసుకోకుండా కామెంట్స్ చేస్తారు..

## నెట్టింట నెగెటివిటీపై రకుల్ ప్రీత్ సింగ్

తెలుగు, తమిళం, హిందీ ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని యాక్టర్ రకుల్ ప్రీత్ సింగ్. పక్కా ప్రొఫెషనల్‌గా ఉండే ఈ భామ అప్పడప్పుడు నెటిజన్లు, అభిమానులతో తన అభిప్రాయాలను షేర్ చేసుకుంటుంది. తాజాగా సోషల్ మీడియాలో పెరుగుతున్న నెగెటివిటీ గురించి మాట్లాడింది. సోషల్ మీడియా అనేది కొందరు జనాలు ముక్కుమొఖం తెలియని అకౌంట్లతో తరచూ కఠిన వ్యాఖ్యలు చేస్తూ నెగెటివిటీని ప్రచారం చేసే హబ్‌లాంటిది. చాలా మంది వ్యక్తులు అజ్ఞాత ప్రొఫైల్స్‌తో స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తుంటారు. వారు చేస్తున్నకామెంట్ల ప్రభావం ఎలా ఉంటుందో కనీసం అర్థం చేసుకోరని చెప్పింది. అందరినీ మెప్పించడం అసాధ్యమన్న రకుల్ ప్రీత్ సింగ్ సెలబ్రిటీలు ఆన్‌లైన్‌లో వచ్చే అనవసరమైన ట్రోల్స్, విమర్శల వల్ల తమ ఫోకస్ మార్చుకోకూడదు. నెగెటివిటీని ఎదుర్కొనేందుకు వాటిని పట్టించుకోకుండా వ్యక్తిగత, వృత్తి పరమైన లక్ష్యాలపైన దృష్టి పెట్టడమే ఉత్తమ మార్గమనని చెప్పుకొచ్చింది. ఇండియన్ 2 సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకొచ్చిన రకుల్ ప్రీత్ సింగ్.. స్ట్రెయిట్ తెలుగు సినిమా చేయక చాలా కాలమే అవుతుంది. ప్రస్తుతం రణ్ బీర్ కపూర్ నటిస్తోన్న రామాయణలో కీలక పాత్రలో నటిస్తోంది. రకుల్ నటించిన ఫ్ఱఫ్అఱాబతీ ఔశీష్ట్ర ణశీ ప్రస్తుతం ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్‌లో ట్రెండింగ్ అవుతోంది. ఈ భామ నెక్స్ ఇండియన్ 3 చేయాల్సి ఉంది. మరి తెలుగు సినిమాలో ఎప్పుడు కనిపిస్తుందో చూడాలి.

# అల్లు అర్జున్ 'రాకా' టీంలోకి మరో భామ.. ఇంతకీ పాత్ర ఏంటో మరి..?

టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబోలో 'రాకా' సినిమా వస్తుందని తెలిసిందే. సైన్స్ ఫిక్షన్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో వస్తోన్న ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ ప్రాజెక్టులో ఇప్పటికే మలయాళ నటి ఫెమినా జార్జ్, పంజాబీ నటి నైలా గ్రేవల్ భాగమైనట్టు క్రేజీ అప్‌డేట్స్ వచ్చాయని తెలిసిందే. తాజాగా మరో ఆసక్తికర నెట్టింట వైరల్ అవుతోంది. తెలుగు నటి సిరి హన్మంతు 'రాకా' చిత్రంలో జాయిన్ అయింది. రీసెంట్‌గా జరిగిన ఓ ఈవెంట్‌లో నిర్మాత ఎస్‌కేఎన్ ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. సిరి హన్మంతు చివరగా సీతాపయనంలో మెరవగా.. త్వరలో విడుదల కానున్న ' చెన్నై లవ్ స్టోరీ' లో కూడా సందడి చేయనుంది. ఈ నేపథ్యంలో ఇంతకీ సిరి హన్మంతు రాకా మూవీలో ఎలాంటి పాత్రలో కనిపించబోతున్నది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ముంబైలో షూటింగ్ కొనసాగుతోంది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ తెరకెక్కిస్తోంది. ఈ మూవీని 2027 చివరలో విడుదల చేయనున్నారు. ఈ చిత్రానికి సాయి అభ్యాంకర్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు.



# 'కొరియన్ కనకరాజు' కొత్త సాంగ్ రిలీజ్

మెగాహీరోల్లో వరుణ్ తేజ్ ఒకడు. ముకుంద, ఫిదా, తొలిప్రేమ, కంచె లాంటి సినిమాలతో కెరీర్ ప్రారంభంలో సమ్‌థింగ్ డిఫరెంట్ అనిపించుకున్నాడు. తర్వాత నుంచి వరసపెట్టి ఫ్లాప్స్ పడ్డాయి. 2019లో వచ్చిన 'గద్దలకొండ గణేశ్' ఓ మాదిరిగా ఆకట్టుకోగా.. తర్వాత వచ్చిన గని, గాంఢీవదారి అర్జున, ఆపరేషన్ వాలంటైన్, మాట్కా చిత్రాలు ఒకదానిని మించి మరొకటి డిజాస్టర్స్ అయ్యాయి. దీంతో రెండేళ్లు గ్యాప్ తర్వాత వరుణ్ తేజ్ నుంచి వస్తున్న సినిమా 'కొరియన్ కనకరాజు'. వచ్చే నెల 7న థియేటర్లలో రిలీజ్ కానుంది. వారం క్రితం టీజర్ రిలీజ్ చేయగా పర్లేదనిపించుకుంది. ఈ క్రమంలోనే ఇప్పుడు 'రసగుమ్మడి' అంటూ ఓ పాట వదిలారు. విలేజ్ స్టైల్లో సాగే మాస్ బీట్‌తో ఉన్న ఈ గీతం కలర్‌ఫుల్‌గా బాగుంది. తమన్ మ్యూజిక్ వినసొంపుగా ఉంది. ఇకపోతే ఈ చిత్రానికి మేర్లపాక గాంధీ దర్శకుడు. రితికా నాయక్ హీరోయిన్.



The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.